తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
16 నవంబరు, 2025



తుఫాన్‌లూ.. సైక్లోన్లు

# విచ్ఛిన్నానికి సైరన్లు

# వెంకటేశ్ జోడీగా శ్రీనిధి శెట్టి !





వెండితెరపై బంగారు తీగ మాదిరిగా మెరిసిన కథానాయికలలో శ్రీనిధి శెట్టి ఒకరు. అలాగే చీరకట్టులో మరింత ఆకర్షణీయంగా అనిపించే నాయికలలో కూడా ఆమె పేరును చేర్చుకోవచ్చు. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవడం, స్టార్ డమ్‌ను సంపాదించుకోవడం చాలా తక్కువ మంది కథానాయికల విషయంలో మాత్రమే జరుగుతూ ఉంటుంది. అలాంటి అరుదైన కథానాయికల జాబితాలో, 'కేజీఎఫ్' సినిమా ఆమెకి స్థానం దక్కేలా చేసింది. ఒకవైపు కన్నడలో తనకి నచ్చిన పాత్రల కోసం వెయిట్ చేస్తూనే, మరో వైపున ఆమె టాలీవుడ్, కోలీవుడ్‌పై దృష్టి పెట్టింది. తెలుగులో 'హిట్ 3', 'తెలుసు కదా' సినిమాలు చేసిన శ్రీనిధి శెట్టి, ఇప్పుడు త్రివిక్రమ్ వెంకటేశ్ కాంబినేషన్‌లోని సినిమాలోను ఛాన్స్ కొట్టేసింది. త్రిష మొదలు చాలామంది సీనియర్ హీరోయిన్స్ పేర్లను పరిశీలించి చివరికి ఆమెను ఎంపిక చేసినట్లు టాక్. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైపోయింది. శ్రీనిధి శెట్టి మంచి పొడగరి. చీరకట్టులో ఆమె మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. తెరపై ఆమెను చూసినప్పుడే తెలుగులో వెంకటేశ్ జోడీగా ఆమె బాగా సెట్ అవుతుందని వెంకీ అభిమానులు భావించారు. అయితే ఆ ముచ్చట ఇంత త్వరగా తీరుతుందని ఎవరూ అనుకోలేదు. దర్శకుడిగా త్రివిక్రమ్ తొలిసారిగా వెంకటేశ్‌తో చేస్తున్న ఈ సినిమాలో ఆమెకి ఛాన్స్ దొరకడం విశేషం. ఈ సినిమాతో తెలుగులో దశ తిరిగిపోవడం ఖాయమనే నమ్మకంతో ఫ్యాన్స్ ఉన్నారు.

తారాతీరం

# 'మన శంకర వరప్రసాద్ గారు' జనవరిలో రిలీజ్?

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం చిత్రబృందం చిరంజీవి, విక్టరీ వెంకటేష్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తోంది. ఈ సినిమా చిరు, అనిల్ రావిపూడి కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ కాగా నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.

ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల' సూపర్ హిట్‌గా మారి సినిమాపై భారీ హైప్ తీసుకువచ్చింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ మాస్ ఎంటర్‌టైనర్ జనవరి 12న థియేటర్లలో విడుదల కావచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

ఈ చిత్రాన్ని సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కేథరిన్ త్రెసా కీలక పాత్రలో కనిపిస్తుండగా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



ఆదివారం వార్త

16 నవంబరు, 2025

## మంచి ముత్యాలు

– నూతన సందర్భాలు నూతన బాధ్యతలను సృష్టిస్తాయి. కాలం ఉత్తమ ప్రాచీనతను మోటుగా మారుస్తుంది. – లోవెల్

– అసాధారణ బాధల ఫలితమే ప్రతిభ. – లాంగ్‌ఫెలో

## కదంబం

'సంఘీ'భావం....5
హైవేలపై పెరుగుతున్న ప్రమాదాలు

కవర్ స్టోరీ..6
తుఫాన్లూ.. సైక్లోన్లు విచ్ఛిన్నానికి సైరన్లు

ఉప్పునీటి స్నానంతో.. 12

కథ..20
శాంత అలియాస్

ఈ వారం కవిత్వం...27
నా జీవన సంధ్యా సమయంలో..

ఇంకా...
మొగ్గ
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## అతి పెద్ద మ్యూజియం



ప్రపంచంలోని అతి పెద్ద మ్యూజియం ఇటీవల ఈజిప్టులో ప్రారంభమైంది. కైరోలోని గాజా పిరమిడ్ల దగ్గర నిర్మించిన ఈ మ్యూజియం పూర్తి కావడానికి రెండు దశాబ్దాలు పట్టింది. ఇందులో సుమారు యాభై వేల కళాఖండాలు వున్నట్లు తెలుస్తోంది. ఈ కళాఖండాలన్నీ ఈజిప్టు పురాతన నాగరికతను ప్రతిబింబిస్తాయి. ఇరవై నాలుగు వేల చదరపు మీటర్ల వైశాల్యంలో నిర్మించిన ఈ మ్యూజియానికి సుమారు ఎనిమిది వేల కోట్లకు పైగా ఖర్చయినట్లు సమాచారం. ఈ మ్యూజియంలో పన్నెండు ప్రధాన గ్యాలరీలు ఉన్నాయి.

### ఇది ఆసుపత్రే..

ఆసుపత్రుల్లోని రోగులు త్వరగా జబ్బు తగ్గిపోయి ఇంటికి వెళ్లిపోవాలని తమ ఇష్టదైవాల్ని వేడుకుంటారు. కానీ ఓ ఆసుపత్రినే దేవాలయంగా మార్చడం ఎక్కడైనా చూశారా? చెన్నైలోని సవిత డెంటల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌కి వెళ్తే ఈ విచిత్రం చూడవచ్చు. స్వాగతం పలికే ఆర్చ్ నుంచి ఆసుపత్రి గోడలు, స్తంభాలు నిర్మాణం వరకు అంతా దేవుళ్ల విగ్రహాలతో, అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో కనువిందు చేస్తాయి. మహా ద్వారం మీదున్న విగ్రహాల మీద స్టెతస్కోప్, ఇంజెక్షన్ల నమూనాలను తీర్చిదిద్దారు. లోపల నిలువెత్తు మురుగన్ విగ్రహం చూడవచ్చు. హాస్పిటల్ అంటే కలిగే భయాన్ని తగ్గించడం కోసం యాజమాన్యం ఆసుపత్రిని దేవాలయంగా నిర్మించారట. చూడటానికి దేవాలయంలా కనిపించినా లోపల చికిత్సకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయి.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

## ఎవరూ మిగలరు

పార్వతి: "స్వామీ, భూలోకంలో సైబర్ నేరగాళ్లు ఎక్కువైపోయారు. అటువంటి వాళ్లను శిక్షించండి".

శివుడు: "వద్దు దేవీ వద్దు.. అటువంటి వాళ్లను శిక్షించడం మొదలుపెడితే భూలోకంలో మానవులే మిగలరు సుమా!"

## ఎవర్నడిగినా చెబుతారు..

సుబ్బారావు: "మీ ఊరి బస్ స్టాండ్ నుంచి మాట్లాడుతున్నాను, మీ ఇంటికి ఎలా రావాలి?"

అప్పారావు: "బస్టాండు ఎదురు సందు దగ్గరకొచ్చి గయ్యాళి సరోజ మొగుడు ఇల్లు ఎక్కడ? అని ఎవరిని అడిగినా చెప్తారు".

## కరెంటు

భార్య: 'అత్తాకోడళ్లు' సీరియల్ వచ్చేటప్పుడు కరెంటు పోకుండా చూడు స్వామీ!"

భర్త: 'అత్తాకోడళ్లు' సీరియల్ చూసి మా ఆవిడ మా అమ్మని అబ్బంది పెడుతోంది. ఆ టైంలో కరెంటు పోయేటట్టు చూడు స్వామీ.

## పది లక్షలు

పార్కులో ప్రేమికుల సంభాషణ.

రవి: "పైసా కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకుంటాను.. సరేనా?"

లత: "ఏంటీ? నువ్వు పప్పుసుద్దలా వున్నావు, మా అక్కకు ఐదు లక్షలు ఇచ్చారు. నువ్వు పది లక్షలు అడుగు".

– వైదా ఈశ్వరరావు

## అదే కాకి

చింటు: "అమ్మా, మన ఊరికాకి మన తాత గారి ఊరికి కూడా వచ్చిందమ్మా!"

తల్లి: "ఎలా గుర్తు పట్టావు?"

చింటు: "అక్కడ కావ్.. కావ్ అని అరిచినట్లే ఇక్కడ కూడా కావ్..కావ్ అనే అరుస్తోందమ్మా! అందుకే






గుర్తుపట్టాను" అన్నాడు.

– మా.శ్రీ.రాజు, పాల్వంచ

## మా ఆవిడకు చెప్పండి

"మీరు చాలా బలహీనంగా వున్నారు. మందు రాసిస్తాను, మూడు పూటలా తాగండి" అన్నాడు డాక్టర్ పేషెంట్‌తో.

"ఆ మాట మా ఆవిడకు చెప్పండి. మందు తాగొద్దని రోజూ గొడవ చేస్తోంది" అన్నాడు పేషెంటు.

## అనస్తీషియన్

"కాసేపు ఆగండి.. అనస్తీషియన్ రాగానే మీకు మత్తిచ్చి ఆపరేషన్ చేస్తారు" అంది.

"పరవాలేదు. నా దగ్గర ఫుల్ బాటిల్ మందు వుంది. తాగి పడుకుంటాను. డాక్టరు గారిని ఆపరేషన్ చేసేయమని చెప్పండి" అన్నాడు.

ఆ మాటతో నర్స్ కోమాలోకి వెళ్లిపోయింది. పేషెంట్ హ్యాపీగా పడుకున్నాడు.

– టి.సదాశివరెడ్డి

## ప్యారడీ పాట

**'స్వయంవరం' చిత్రంలోని 'గాలివానలో వాన నీటిలో' పాటకు ప్యారడీ.**

**పల్లవి:** టెంత్ క్లాసులో థర్డు క్లాసుతో చదువు ప్రయాణం
జాబ్ వచ్చునో జేబు నిండునో తెలియదు పాపం..
తెలియదు పాపం...
అయ్యయ్యో...ఓఓఓ.. అయ్యయ్యో...ఓఓఓ..
అయ్యయ్యో అయ్యయ్యో ॥టెంత్॥

**చరణం:** ఇంటరుతోనూ పోరాటం
మార్కులకోసం ఆరాటం
ఇంటరులోన ఇరుక్కుపోయి కదలనన్నది రథం
అయినా చదువు ప్రయాణం
జాబ్ వచ్చునో జేబు నిండునో తెలియదు పాపం..
తెలియదు పాపం...
అయ్యయ్యో...ఓఓఓ.. అయ్యయ్యో...ఓఓఓ..
అయ్యయ్యో అయ్యయ్యో ॥టెంత్॥

**చరణం:** సప్లమెంటరితో సహవాసం
పరీక్ష హాలులో వనవాసం
సప్లమెంటరీ సప్లై వున్నా కదలనన్నది కలం
అయినా చదువు ప్రయాణం
జాబ్ వచ్చునో.. జేబు నిండునో తెలియదు పాపం..
తెలియదు పాపం...
అయ్యయ్యో...ఓఓఓ.. అయ్యయ్యో...ఓఓఓ..
అయ్యయ్యో అయ్యయ్యో ॥టెంత్॥

**చరణం:** పెళ్ళి చూపులలో అవమానం ముదిరిన బెండతో
ఉపమానం వేపుడు వేస్తు పులుసుకు వేస్తని
పలుకుతున్నది జనం అయినా బతుకు ప్రయాణం
జాబ్ వచ్చునో జేబు నిండునో తెలియదు పాపం..
తెలియదు పాపం...
అయ్యయ్యో...ఓఓఓ.. అయ్యయ్యో...ఓఓఓ..
అయ్యయ్యో అయ్యయ్యో ॥టెంత్॥

– దాసరి చంద్రయ్య

## 'సంఘీ' భావం



# హైవేలపై పెరుగుతున్న ప్రమాదాలు

దేశంలో పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర నిర్ణయించింది. దీనికి సంబంధించి తీసుకుంటున్న అనేక నిర్ణయాల్లో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లపై కూడా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇంజినీరింగ్ నిబంధనలకు అనుగుణంగా తగిన సాంకేతికతను ఉపయోగించి రోడ్లను నిర్మిస్తే చాలా వరకు ప్రమాదాలను అరికట్టవచ్చని నిపుణులు కేంద్రానికి సూచించారు. ఉదాహరణకు తెలంగాణా రాష్ట్రంలో కరీంనగర్ మీదుగా వెళ్లే రాజీవ్ రహదారిపై గతంలో వరుసగా ప్రమాదాలు జరిగేవి. ఒక్కొక్కసారి పది నుంచి ఇరవై మంది మృతి చెందిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. కీలక మలుపుల వద్ద సరైన హెచ్చరికలు లేకపోవడం, ఒకేసారి రోడ్డు మలుపు తిప్పడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు స్పష్టం చేశారు. ఈ లోపాలు సరిదిద్దిన తరువాత చాలా వరకు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి.

రోడ్డు ప్రమాదాలకు అనేక కారణాలు ఉంటాయి. అందులో ముఖ్యంగా డ్రైవర్ పనిగంటలు, రోడ్డు నిర్మాణ స్థితిగతులు, ట్రాఫిక్, తెల్లవారుజామున, మధ్యాహ్నం వంటి సమయాలపై ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటన్నిటినీ విశేషిస్తూ ఎక్కువ భాగం ప్రమాదాలకు రోడ్డు నిర్మాణ లోపాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. రోడ్లు గుంతలమయంగా ఉండటంతో వేగంగా వస్తున్న వాహనం డ్రైవర్ దానిని తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంగానీ, ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడటం, డివైడర్‌ను ఢీకొనడం వంటివి చోటుచేసుకుంటాయి. కొన్ని సందర్భాల్లో హైవేలలో డివైడర్ దాటి అటువైపుగా వస్తున్న వాహనంపై పడి భారీ ప్రాణనష్టానికి దారి తీస్తుంది. ఉదాహరణకు తెలంగాణలోని చేవెళ్లలో కంకరలారీ, ఆర్టీసీ బస్సు ప్రమాదానికి కూడా రోడ్డు సరిగ్గా లేకపోవడం ఒక కారణమని తేలింది. ప్రస్తుతం చాలా రోడ్లు బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్ ఫర్ (బివోటీ) విధానంలో నిర్మిస్తున్నారు. ముందుగా కాంట్రాక్టర్ కొంత పెట్టుబడి పెట్టి రోడ్డు నిర్మించి, ఆ రోడ్డు మీదుగా వెళ్లే వాహనాల నుంచి టోల్ వసూలు చేసి రోడ్డు నిర్వహణతో పాటు నిర్మాణానికి అయ్యే ఖర్చును కూడా దశలవారీ వసూలు చేసుకునే అవకాశం ఉంది. ఈ విధానం వల్ల రోడ్డు కనీసం పది సంవత్సరాల వరకు ఎక్కడ గోతులు ఏర్పడినా వెంటనే కాంట్రాక్టర్ పూడ్చి వేసి రోడ్డు మరింతగా దెబ్బతినకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది.

ఇకపై ప్రమాదాలకు కాంట్రాక్టర్ల ప్రమేయాన్ని కల్పిస్తూ కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. త్వరలోనే వీటిని ఉత్తర్వుల రూపంలో పొందుపరిచే అవకాశం ఉంది. ఇందులో భాగంగా జాతీయ రహదారిలోని నిర్దిష్ట ప్రాంతంలో సంవత్సరంలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తే సంబంధిత కాంట్రాక్టర్లకు భారీ జరిమానా విధించాలని రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్ ఫర్ విధానంలో నిర్మించే రహదారులకు దీన్ని వర్తింపజేయనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. బీవోటీ విధానంలో నిర్మించే హైవేలపై ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లదేనని, వారే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉమాశంకర్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి బీఓటీ పత్రాన్ని సవరించామన్నారు.

"నిర్దిష్ట ప్రాంతం.. 500 మీటర్ల పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే ఆ రోడ్డు వేసిన కాంట్రాక్టరుకు 25 లక్షల జరిమానా విధిస్తామని, అదే ప్రాంతంలో మరుసటి ఏడాది ప్రమాదం జరిగితే ఇది 50 లక్షలకు పెరుగుతుందని ఆయన చెప్పారు. కేంద్ర హైవే మంత్రిత్వశాఖ పరిధిలో ఇటువంటి ప్రమాద ముప్పు ఉన్న 3,500 ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఈ నిర్ణయంతో హైవే ప్రమాదాలకు కట్టడి వేసేందుకు దోహదం చేస్తుందని కేంద్రం భావిస్తోంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్‌స్టోరీ

# తుఫాన్‌లూ..సైక్లోన్లు విచ్ఛిన్నానికి సైరన్లు

షేక్ అబ్దుల్ హకీం జాని

ఇటీవల మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అనేక విధాలుగా నష్టాలు జరుగుతాయి. ప్రకృతి వైపరీత్యాలు అనేవి తరదుగా హెచ్చరిక లేకుండా సంభవించే విపత్తు సంఘటనలు. ఈ విపత్తులు పర్యావరణ వ్యవస్థను దెబ్బతీస్తాయి. వ్యక్తిగత జీవితాలు, ఆస్తి, రవాణా, జీవనోపాధి ఇత్యాది వాటికి నష్టం వాటిల్లుతుంది.

ప్రకృతి వైపరీత్యాలను నివారించడం అసాధ్యం. అయితే సకాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవచ్చు. తుపానులు, వరదలు, భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, సుడిగాలులు, కరువు, అటవీ అగ్ని ప్రమాదాలు, మంచు తుపానులు ఇత్యాదివన్నీ ప్రకృతి వైపరీత్యాలే. ఈ విపత్తులు తరచుగా ఆకస్మాత్తుగా సంభవించి భారీ నష్టాన్ని కలిగిస్తాయి. ఈ వైపరీత్యాల వల్ల అనేక మంది ప్రజలు మరణించి ప్రాణనష్టం జరగవచ్చు. ఇళ్లు, భవనాలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ధ్వంసమై భారీగా ఆస్తి నష్టం సంభవించవచ్చు. పర్యావరణంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది.

## అప్పపీడనం-అధిక పీడనం

అల్పపీడనం, అధిక పీడనం అనేవి వాతావరణ శాస్త్రంలో చాలా ముఖ్యమైన పదాలు. ఇవి గాలి ఒత్తిడిలో తేడాలను సూచిస్తాయి.

**అల్పపీడనం:** భూమి మీద ఎక్కడ గాలి వేడెక్కి పైకి ఎగసిపోతుందో అక్కడ గాలి ఒత్తిడి తక్కువగా ఉంటుంది. దీన్ని అల్పపీడన ప్రాంతం అంటారు. సముద్రంపై సూర్యరశ్మి ఎక్కువగా పడితే గాలి వేడెక్కి పైకి ఎగసిపోతుంది. అక్కడ అల్పపీడనం ఏర్పడుతుంది. సమీప ప్రాంతాల నుండి చల్లని గాలి ఈ ప్రాంతానికి చేరుతుంది. దీని వల్ల గాలులు, మేఘాలు, వర్షాలు, తుఫానులు ఏర్పడవచ్చు. సులభంగా చెప్పాలంటే 'గాలి పైకి ఎగసిపోతే అల్పపీడనం'. ఇది సాధారణంగా తుపానులు, వర్షాల రూపంలో కలిగించే వాతావరణం.

**అధిక పీడనం:** గాలి చల్లబడినప్పుడు అది భారీగా అవుతుంది. కిందకు దిగుతుంది. అప్పుడు అక్కడ గాలి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. దీన్ని అధికపీడన ప్రాంతం అంటారు. శీతాకాలంలో చల్లని గాలి కిందకు దిగుతుంది. అధికపీడనం ఏర్పడుతుంది. గాలి బయటకు పాకుతుంది. సులభంగా చెప్పాలంటే 'గాలి కిందకు దిగితే అధికపీడనం'. ఇది సాధారణంగా శాంతమైన, పొడి వాతావరణం కలిగిస్తుంది.

## తుపానులు ఎందుకు ఏర్పడతాయి?

తుపానులను సముద్రాలపై ఏర్పడే తీవ్ర వాతావరణ పరిస్థితి అనవచ్చు. ఇవి ఉష్ణమండల ప్రాంతాలలోని వేడి సముద్ర జలాల వలన ఏర్పడతాయి. తుపానులు ఎలా ఏర్పడతాయనేది దశలవారీగా ఉంటుంది. సముద్రం పైభాగంలోని నీటి ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉన్నప్పుడు, ఆ నీరు వేడెక్కి ఆవిరి రూపంలో గాలిలోకి ఎగుస్తుంది. ఆ వేడి గాలి పైకి ఎగిసినప్పుడు, కింద అల్పపీడనం ఏర్పడుతుంది. దానివల్ల చుట్టుపక్కల నుంచి గాలి ఆ చోటుకు ప్రవహిస్తుంది.గాలి పైకి వెళ్ళే కొద్దీ చల్లబడుతుంది. ఆవిరి మేఘాలుగా మారి తేమను విడుదల చేస్తుంది. ఆ తేమ రూపంలో ఉన్న వేడి వాతావరణాన్ని ఇంకా వేడిగా చేస్తుంది. భూభ్రమణం కారణంగా గాలులు చక్రంలాగా తిరుగుతాయి.



ఉత్తరార్ధగోళంలో గడియారానికి వ్యతిరేకంగా, దక్షిణార్ధగోళంలో గడియార దిశలో గాలులు తిరుగుతాయి. ఈ గాలి తిప్పులు మరింత వేగంగా తిరుగుతూ విహంగ వీక్షణం చేస్తే సముద్ర జలాలు. వలయాకారంలో మేఘాల మాదిరి కనిపిస్తాయి. ఆ మధ్యలో గుండ్రని ఖాళీ ప్రదేశం ఉంటుంది. దీన్ని కన్ను అంటారు.. ఇదే తుపాను.



ఈ తుపాను భూమికి చేరినప్పుడు సముద్రపు వేడి గాలి లేకపోవడంతో అది క్రమంగా బలహీనపడుతుంది. కానీ తీర ప్రాంతాల్లో వరదలు, అధిక వర్షాలు, పెనుగాలులు వీచి నష్టం కలిగిస్తుంది. తుపానులు ఏర్పడటానికి అనేక ప్రధాన కారణాలు ఉన్నాయి. వేడి సముద్ర జలం, తేమ గాలి, అల్పపీడనం, భూభ్రమణం ఇత్యాదివి. 'తుపాను తీరం చేరడం' అంటే సముద్రంలో ఏర్పడిన తుఫాను భూమి వైపుకు వచ్చి తీర ప్రాంతాన్ని తాకడం అని అర్థం. దీన్ని సాధారణంగా 'తుపాను ల్యాండ్ ఫాల్' అని కూడా అంటారు. తుపానులు సముద్రం మీద ఏర్పడతాయి. అవి గాలులు, వర్షాలు, అలలతో కదులుతూ భూభాగం వైపు వస్తాయి. ఆ తుపాను మధ్యభాగం తుపాను కంటి భాగం ఏదైనా దేశ తీరాన్ని తాకినప్పుడు, దానిని 'తుపాను తీరం చేరింది' అని అంటారు. ఉదాహరణకు 'యాస్ తుపాను ఒడిశా తీరాన్ని చేరింది' అంటే ఆ తుఫాను సముద్రం నుండి కదిలి, ఒడిశా భూభాగాన్ని తాకిందని అర్థం. తుపాను తీరం చేరిన సమయంలో బలమైన గాలులు వీయడం, భారీగా వర్షం కురవడం, సముద్ర అలలు (తుఫాను అలలు) ఉవ్వెత్తున ఎగసి పడటం, తీర ప్రాంతాల్లో వరదలు, నష్టం కలగడం ఇత్యాది ఘటనలు సంభవిస్తాయి.

## తుపానులకు పేర్లు ఎవరు పెడతారు?

తుపానులకు పేర్లు ప్రపంచ వాతావరణ సంస్థ పర్యవేక్షణలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రాలు, దేశాల వాతావరణ శాఖలు కలిసి నిర్ణయిస్తాయి. భారతదేశంలో ఉన్న బంగాళాఖాతం, అరేబియా సముద్రానికి సంబంధించిన తుపానుల పేర్లను న్యూఢిల్లీలోని భారత వాతావరణ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రం నిర్ణయిస్తుంది. బంగాళాఖాతం, అరేబియా మహాసముద్రం, హిందూ మహాసముద్రంలో ప్రతి ఏడాది అనేక తుపానులు సంభవిస్తుంటాయి. అన్నింటినీ గుర్తుపెట్టుకోవడం, వీటి గురించి ప్రజలకు తెలియజేయడం కోసమే తుపానులకు పేర్లు పెడతారు. దాదాపు 61 కి.మీ. కు పైబడి వేగంతో గాలులు వీస్తూ వచ్చిన తుపానులకు మాత్రమే పేర్లు పెట్టడం సంప్రదాయంగా వస్తుంది.

## తుపాను పేర్లు ఎవరెవరు ఇస్తారు?

బంగాళాఖాతం, అరేబియా సముద్రాలకు చుట్టుపక్కల ఉన్న భారతదేశం, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక, మాల్దీవులు, మయన్మార్, థాయిలాండ్, ఒమాన్, కతార్, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యమన్ ఇత్యాది 13 దేశాలు తుఫానులకు పేర్లు ఇస్తాయి. అట్లాంటిక్ సముద్ర ప్రాంతంలో తుపానులకు పేర్లు పెట్టే సంప్రదాయం 1953 నుండే ఉంది. 2020లో ప్రపంచ దేశాలు సూచించిన 169 పేర్లతో కొత్త జాబితా తీసుకువచ్చారు.

## తుపానుకు పేరు ఎలా పెడతారు?

ప్రపంచ వాతావరణ శాఖ ఆధ్వర్యంలో బంగాళాఖాతం, అరేబియా, హిందూ మహాసముద్రాల పరిధిలోని దేశాలు సమావేశమయ్యాయి. ప్రతి దేశం ముందుగా తమకు నచ్చిన కొన్ని పేర్లు జాబితాగా ఇస్తుంది. ఆ పేర్లు అక్షర క్రమంలో లేదా వరుసగా వాడతారు. 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపానుకు ఆ పేరును ఒమన్ దేశం సూచించింది. 2018లో వచ్చిన తిత్లీ తుపానుకు పాకిస్తాన్, 2019 తుపానుకు ఫణి అని బంగ్లాదేశ్, 2021లో తుపానుకు గులాబ్ అని పాకిస్తాన్, అదే ఏడాది యాస్ తుపానుకు ఆ పేరును ఒమన్ దేశం సూచించాయి. మన దేశం కూడా కొన్ని తుపాన్ల పేర్లను సూచించింది. గతి, తేజ్, ఆగ్, నీర్, వ్యం, ఝుర్, జలధి, మురసు, ప్రోహబో, ప్రభంజన్, మూమి, అంబుడ్, వేగ.. ఇత్యాది పేర్లను మన దేశం సూచించింది. బంగ్లాదేశ్ సూచించిన నిసర్, మనదేశం సూచించిన గత పేర్లను తుపాన్లకు వాడేశారు. పలకడానికి సులువుగా ఎనిమిది అక్షరాలలోపే తుపాను పేరు ఉండాలి. ఏ దేశం భావోద్వేగాలను, విశ్వాసాలను దెబ్బతీయని విధంగా పేరు ఉండాలి. సభ్యదేశాలు సూచించిన పేరును తిరస్కరించే అధికారం, మార్పు చేసే అధికారం చానల్‌కు ఉంటుంది.

## వివిధ దశలుగా తుపానుల వర్గీకరణ

ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్, ఇతర వాతావరణ పరికరాల ద్వారా సైక్లోన్ నిర్మాణం, కన్ను, గోడలను విశ్లేషించి దాని తీవ్రతను నిర్ధారిస్తారు. 222 కి.మీ. కంటే గాలి ఎక్కువగా వీస్తే దాన్ని సూపర్ సైక్లోన్ అంటారు. సూపర్ సైక్లోన్లు భారీ వర్షాలు, తీవ్రమైన తుఫాను ఉప్పెనలు, విస్తృతమైన వాతావరణ అస్థిరతను కలిగిస్తాయి. 1999లో ఒడిశా తుపాను సమయంలో గాలి వేగం గంటకు 260 కి.మీ. వరకు చేరుకుంది. అందుకే దీన్ని సూపర్ సైక్లోన్‌గా వర్గీకరించారు.

## ప్రపంచంలో వచ్చిన అతి పెద్ద తుపానులు

ప్రపంచ వ్యాపితంగా పలు సందర్భాలలో అతి పెద్ద తుపానులు వచ్చాయి.



వాటి వివరాల్లోకి వెళితే అనేక హృదయవిదారక సంఘటనలు మన కళ్ళ ఎదుట సాక్షాత్కరిస్తాయి. ప్రపంచంలో తుపానులను పలు రకాలుగా సంబోధిస్తారు. అమెరికాలో టోర్నడోలు అని, చైనాలో ఏర్పడే వాటిని టైఫూన్ అని, హిందూ మహాసముద్రంలో ఏర్పడే వాటిని సైక్లోన్స్ అని పిలుస్తారు.

**టైఫూన్ (1979):** ఫిలిప్పీన్స్ సమీపంలో పసిఫిక్ మహాసముద్రం టైఫూన్ అనే అతి పెద్ద తుపాను 1979లో సంభవించింది. సముద్రంలో దీని వ్యాసం 2,220 కి.మీ. గంటకు 305 కి.మీ వేగంలో పెనుగాలులు వీచాయి: ఫిలిప్పీన్స్ ప్రాంతంలో అనేక మరణాలు సంభవించడమే కాక భారీ నష్టం జరిగింది. ఇది ప్రపంచ రికార్డు. ఇప్పటి వరకు రికార్డు చేసిన అతి పెద్ద తుపాను.

**హరికేన్ ప్యాట్రీషియా (2015):** ఇది మెక్సికోలోని తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడింది. మెక్సికోలో తీరం దాటినప్పుడు గంటకు 346 కి.మీ. వేగంతో గాలులు వీచగా 8 మరణాలలతో పాటు అపారమైన నష్టం ఏర్పడింది. అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలలో ఈ తుపాను రికార్డు.

**సైక్లోన్ విన్‌స్టన్ (2016):** ఫిజీలోని దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడింది. దక్షిణ అర్ధగోళంలో అతి బలమైనది. గంటకు 285 కి.మీ. వేగంతో గాలులు వీయగా 44 మరణాలతో పాటు ఆర్థికంగా పెనునష్టం వాటిల్లింది. ఫిజీ దేశ చరిత్రలో ఇది ఘోరమైన విపత్తు.

**హరికేన్ ఇర్మా (2017):** ఫ్లోరి కరేబియన్ సమీపాన అట్లాంటిక్ మహాసముద్రంలో ఈ తుపాను సంభవించింది. గంటకు 295 కి.మీ. వేగంతో గాలులు వీయగా 134 మరణాలుతో పాటు చాలా నష్టం ఏర్పడింది.

**గ్రేట్ భోలా సైక్లోన్ (1970):** ఇది భారతదేశం, బంగ్లాదేశ్ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడింది. గంటకు 205 కి.మీ. వేగంతో గాలులు వీచగా మరణాలు లక్షల్లో సంభవించినట్లు అంచనా, ఆధునిక చరిత్రలో ఇది అతి ఘోరమైన తుపాను, సముద్రపు ఉప్పెన దాదాపు 10 మీటర్ల ఎత్తున ఎగసిపడి అపారమైన నష్టాన్ని కలిగించింది.

## భారతదేశంలో భీకర తుపానులు

భారతదేశంలో చరిత్రలో ఎన్నో భీకర తుపానులు వచ్చాయి. ఈ తుపానులు ముఖ్యంగా బంగాళాఖాతంతో పాటు కొంతమేరకు అరేబియా సముద్రంలో ఏర్పడ్డాయి.

**ఒడిశా సూపర్ సైక్లోన్:** ఈ భయానక తుపాను 1999 అక్టోబర్ 29న ఒడిశా రాష్ట్రంలో ఏర్పడింది. గంటకు సుమారు 260 కి.మీ నుండి 300 కి.మీ వేగంతో వీచిన గాలులకు భువనేశ్వర్, కేందరపారా, జగత్సింగ్‌పూర్ ఇత్యాది ప్రాంతాలలో పదివేలకు పైగా ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించాయి. భారతదేశ చరిత్రలో దీన్ని అత్యంత ఘోరమైన తుపానుగా పరిగణిస్తారు.

**భోలా సైక్లోన్:** ఈ తుపాను 1970 నవంబర్ 12న అప్పట్లో తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్)తో పాటు భారత తీర ప్రాంతాలపై కూడా ప్రభావం చూపింది. 185 కి.మీ. వేగంతో వీచిన గాలులకు 5 లక్షల మందికిపైగా చనిపోయారు. ఇది ప్రపంచ చరిత్రలో అత్యధిక ప్రాణనష్టం కలిగించిన తుపాను.

**అమ్ఫాన్ తుపాను:** 2020 మే 20న పశ్చిమ బెంగాల్, ఒడిశాలలో సంభవించిన ఈ తుపాను కారణంగా గంటకు 240 కి.మీ. వేగంతో గాలులు వీచగా వంద మందికి పైగా చనిపోయారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు ధ్వంసం కాగా కోట్లాది రూపాయల ఆస్తినష్టం ఏర్పడింది.

**ఫణి తుపాను:** 2019 మే 3వ తేదీన ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన ఈ తుపాను కారణంగా 210 కి.మీ. వేగంతో గాలులు వీచగా 80 మందికి పైగా చనిపోయారు. ఇది 2010 తర్వాత భారత్‌ను తాకిన అత్యంత బలమైన ప్రీ-మాన్సూన్ తుపాను.

**తిత్లీ తుపాను:** 2018 అక్టోబర్ 11న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, ఒడిశాలో సంభవించిన ఈ తుపాను కారణంగా గంటకు 160 కి.మీ. వేగంతో గాలులు వీచగా 60 మందికిపైగా మరణించారు.

**నర్గిస్ తుపాను:** 2008లో ప్రధానంగా మయన్మార్‌ను ఈ తుపాను తాకింది. మయన్మార్‌లో లక్ష మందికి పైగా చనిపోయారు. ఇది ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తీరాలపై తీవ్ర ప్రభావం చూపింది.

**తౌక్తే తుపాను:** 2021లో సంభవించిన ఈ తుపాను కారణంగా గుజరాత్, మహారాష్ట్ర, కేరళ, గోవాలో గంటకు 220 కి.మీ. వేగంతో గాలులు వీచగా వంద మంది వరకు చనిపోయారు.

## ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన అతి పెద్ద తుపానులు

ఆంధ్రప్రదేశ్ అతి పెద్ద తీర ప్రాంతం కలిగిన రాష్ట్రంగా, బంగాళాఖాతం నుంచి వచ్చే తుపానులకు ఎక్కువగా గురవుతుంది. 1970 నుంచి 2025 వరకు గడచిన 55 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌కు సుమారు 61 తుపానులు తాకాయి, వాటిలో దాదాపు 40 వరకు అతి భారీ తుపానులు, ఇవి ప్రతి 23 సంవత్సరాలకు ఒకసారి

వస్తాయి. ముఖ్యంగా మే, అక్టోబర్, నవంబర్‌లో తుపానులు వస్తాయి. ఆ సమయాలలో ఇక్కడ అతి పెద్ద స్థాయిలో మరణాలు, ఆస్తినష్టం సంభవించిన ఘటనలు అనేకం ఉన్నాయి.

తుపానులు సంభవించడం, బలమైన గాలులు సముద్రతీరాలకు సమీపిస్తున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత పోర్టుల్లో (విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం ఇత్యాదివి) తుపాను ప్రమాద హెచ్చరికలను జెండాల రూపంలో ఎగురవేస్తారు. వీటిని 'తుపాను హెచ్చరిక సంకేతాలు' అంటారు. ఈ హెచ్చరికలు మొత్తం 11 రకాలుగా (1 నుండి 11 వరకు) ఉంటాయి, కానీ భారత తీరప్రాంతాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో సాధారణంగా 1 నుండి 10 వరకు సంకేతాలు ఉపయోగిస్తారు.

## తుపాను ప్రమాద హెచ్చరిక సంకేతాలు

ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరిక తీరానికి దూరంగా తేలికపాటి గాలులు, వాతావరణంలో మార్పు నౌకలు జాగ్రత్తగా ఉండాలి అని సూచిస్తుంది. రెండో నంబర్ ప్రమాద హెచ్చరిక తీరానికి దూరంగా బలమైన గాలులు, సముద్రం అస్థిరంగా ఉంటుంది అని, మూడవ నంబర్ తీరానికి సమీపంలో బలమైన గాలులు ఉంటాయి. చిన్న పడవలు తీరంలోనే ఉండాలి అని తెలియజేస్తాయి. నాల్గవ నంబర్ తీరానికి సమీపంలో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మత్స్యకారులు సముద్రానికి వెళ్లకూడదని,



అయిదవ నంబర్ తుపాను తీరానికి చేరువలో ఉంది. బలమైన గాలులు, వర్షం వచ్చే అవకాశం ఉందని, అరవ నంబర్ మరింత బలమైన తుపాను వస్తోంది, ప్రజలు తీరప్రాంతాల నుంచి వెనక్కి వెళ్లాలని, ఏడవ నంబర్ తుపాను తీరానికి సమీపంలో 48 గంటల్లో తాకే అవకాశం ఉంది. సిద్ధంగా ఉండాలని, ఎనిమిదవ నంబర్ 24 గంటల్లో తీరం తాకే అవకాశం ఉంది. అత్యవసర ఏర్పాట్లు చేయాలని, తొమ్మిదవ నంబర్ తుపాను తీవ్రత ఎక్కువ, భారీ వర్షాలు, గాలి, అలలు, తీర ప్రాంత ప్రజలు ఖాళీ చేయాలని, పదవ నంబర్ అత్యంత ప్రమాదకర తుపాను తీరాన్ని తాకబోతోంది. పూర్తి అత్యవసర స్థితి అని, పదకొండవ నంబర్ తుపాను కారణంగా పోర్టు మూసివేశారు, ఎవరూ సముద్రంలోకి వెళ్లరాదు అని సంకేతాలు తెలియజేస్తున్నాయి.

## ఆంధ్రప్రదేశ్‌లో తుపానులు

1977 ఆంధ్రలో సంభవించినదాన్ని 'దివిసీమ తుపాను' అంటారు. ఈ తుపాను పేరు చెప్పగానే చాలా మంది ఇప్పటికీ భయపడిపోతారు. 1977 నవంబర్ నెల్లూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో సుమారు పది వేల మందికి పైగా మరణాలు, వందల గ్రామాలు నాశనమయ్యాయి. ఇది ఆంధ్ర చరిత్రలో అతి భయంకరమైన తుపానుగా గుర్తింపు పొందింది. 1990లో సంభవించిన మచిలీపట్నం తుపానులో మచిలీపట్నం, కృష్ణా, గుంటూరు జిల్లాలో సుమారు వెయ్యి మంది మరణించగా సుమారు లక్ష ఇళ్లు ధ్వంసం అయ్యాయి. 1996 సంభవించిన తుపాను కోనసీమలో బీభత్సం సృష్టించింది. కాకినాడ, యానాం మధ్య తీరం దాటిన ఆ తుపాను కారణంగా సంభవించిన ఉప్పెన చాలా నష్టాన్ని, కోనసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలో వెయ్యికిపైగా మరణాలు సంభవించగా పంటలు నాశనమయ్యాయి. భారీగా ఆస్తినష్టం సంభవించింది. అనేక మరణాలు, పంటలు నాశనం, పెద్దగా ఆర్థిక నష్టం సంభవించాయి. 2003లో సంభవించిన బావతీ తుపాను విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో ఓ మోస్తరు నష్టం పంటలు, ఇళ్లకు భారీ నష్టం. 2006లో సంభవించిన క్రైమత్ తుపాను కావలి తీరాన్ని తాకడంలో చాలా నష్టం సంభవించింది. ఇదే ఏడాది అగ్ని తుపాను ఒంగోలు, మచిలీపట్నం మధ్య తీరాన్ని తాకింది.


2010లో లైలా తుపాను బాపట్ల వద్ద తీరాన్ని తాకింది. 2012లో తమిళనాడు వద్ద నీలం తుపాను తీరం తాకింది. దీని ప్రభావం వల్ల చిత్తూరుతో పాటు రాయలసీమ జిల్లాలకు భారీ నష్టం సంభవించింది. 2013 అక్టోబర్‌లో వచ్చిన ఫైలిన్ తుపాను ఒడిశా వద్ద తీరాన్ని తాకింది. ఈ తుపాను వల్ల ఉత్తర ఆంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరంతో పాటు ప్రధానంగా ఒడిశాలో ప్రభావం చూపింది. ఆంధ్రలో కూడా భారీ వర్షాలు కురిసి పంటల నష్టం కలిగింది. 2014లో తిత్లీ తుఫాను కారణంగా శ్రీకాకుళం జిల్లాలో 50 మంది మృతి చెందారు. 2014 అక్టోబర్‌లో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరంలో హుద్‌హుద్ తుపాను వచ్చింది. 20 మందికి పైగా మరణాలు, వేల కోట్ల ఆస్తినష్టం సంభవించడంతో పాటు విశాఖ నగరం పూర్తిగా దెబ్బతింది. 2018లో పితాయి తుపాను కాట్రేటికోన వద్ద తీరం దాటింది. ఇదే ఏడాది తిత్లీ తుపాను శ్రీకాకుళం జిల్లా పలాస వద్ద తీరాన్ని తాకడంతో భారీ నష్టం సంభవించింది. 2018 అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుపాను వల్ల శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 50 మందికి పైగా మరణాలు, పంటల నష్టం జరిగాయి. 2020లో నివార్ అనే తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని రెండు పర్యాయాలు తాకడంతో భారీ నష్టం జరిగింది. 2021 సెప్టెంబర్‌లో వచ్చిన గులాబ్ తుపాను కారణంగా శ్రీకాకుళం, విశాఖపట్నం కొద్దిపాటి మరణాలు, స్వల్పంగా పంటల నష్టం జరిగాయి. 2022లో మాంథాస్ తుపాను వచ్చింది.

ఇదే ఏడాది వచ్చిన మరో తుపాను అస్నా ని మచిలీపట్నం వద్ద తీరాన్ని దాటింది. 2023లో డిసెంబర్‌లో వచ్చిన తుపాను బాపట్ల వద్ద తీరాన్ని దాటింది. మిచౌన్ తుపాను వల్ల నెల్లూరు, తూర్పు గోదావరిలో భారీ వర్షాల కారణంగా చెరువులు పొంగి ప్రవహించాయి. కొన్ని ప్రాంతాల్లో వందల కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. 2024లో బంగాళాఖాతంలో రెమాల్ తుపాన్ వచ్చి తేలికపాటి వర్షాలు కురిశాయి. 2025 అక్టోబర్ 28న వచ్చిన మొంథా తుపాను అందరినీ భయభ్రాంతుల్ని చేసి తీవ్రమైన పంట నష్టాన్ని తెచ్చింది.

## ప్రపంచంలో వచ్చిన అతి పెద్ద భూకంపాలు

సీస్మోగ్రాఫ్ అంటే భూకంపాలు లేదా భూమి లోపలి కదలికల వల్ల వచ్చే సీస్మిక్ వేవ్స్‌ను రికార్డ్ చేసే శాస్త్రీయ పరికరం, రిక్టర్ స్కేల్ అంటే భూకంపాల తీవ్రతను కొలిచే ఒక లాగరిథమిక్ స్కేల్, దీన్ని 1935లో అమెరికన్ సైస్మాలజిస్ట్ చార్లెస్ ఎఫ్. రిక్టర్ అభివృద్ధి చేశాడు. ఇలాంటి అనేక అత్యాధునిక పరికరాల ద్వారా భూకంపాలను ముందుగానే గుర్తించగలుగుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలలో మరొకటి భూకంపాలు. అతి పెద్ద భూకంపాలు సముద్రంలో కూడా ఏర్పడటం వల్ల సునామీలు వస్తున్నాయి. సముద్రపు నీరు ఎగసిపడి అనేక పట్టణాలను ముంచేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. 1960 మే 22లో చిలీలోని వాల్దివియలో వచ్చిన భూకంపం 9.5గా నమోదైంది. ఇది ఇప్పటి వరకు నమోదైన అతి పెద్ద భూకంపం, భారీ సునామీ పసిఫిక్ సముద్ర తీరాన్ని తాకడంతో హవాయి, జపాన్, ఫిలిప్పీన్స్ వరకు బీభత్సాన్ని సృష్టించగా 1,655 మంది చనిపోయారు. 1964లో అలాస్కా (9.2 తీవ్రత), భూకంపం అమెరికా చరిత్రలో అతి పెద్ద భూకంపం, 2024 డిసెంబర్ 26, సుమత్రా, అండమాన్ భూకంపం 9.1 తీవ్రతతో రావడం వల్ల భారతదేశం, శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేషియా 2,30,000 మరణాలు సంభవించాయి.



## భారతదేశంలోని అతి పెద్ద భూకంపాలు

1950 అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద వచ్చిన భూకంపం (8.6) ఇది ఇప్పటివరకు భారతదేశంలో నమోదైన అతి పెద్ద భూకంపం. పర్వతాలు కూలి, నదుల దిశలు మారాయి, లక్షలాది ఇళ్లకు నష్టం వాటిల్లింది. 1905 కాంగ్రా, హిమాచల్ ప్రదేశ్ 7.8 సుమారు 20,000 మంది మరణించారు. కాంగ్రా నగరం పూర్తిగా ధ్వంసమైంది. 1993లో మహారాష్ట్ర లాతూర్ భూకంపం (6.4) 10,000 మందికి పైగా మరణాలు, గ్రామాలు నేలమట్టం అయ్యాయి. 2001 గుజరాత్‌లోని భుజ్‌లో వచ్చిన భూకంపంలో (7.7 తీవ్రత) సుమారు 20,000 మంది మరణించారు, భారీ ఆస్తినష్టం జరిగింది. 2005 కశ్మీర్ (భారత్–పాక్ సరిహద్దు) 7.6 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపం జమ్మూ కశ్మీర్‌లో తీవ్ర నష్టం, పాకిస్తాన్‌లో 70,000 మందికి పైగా మృతి. భారతదేశంలో ఇలా అనేక భూకంపాలు వచ్చాయి.

## మానవ తప్పిదాలు

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో తుపానులు, సునామీలు, వరదలు, భూకంపాలు ఇత్యాది ప్రకృతి బీభత్సాలు జరుగుతున్నాయి. ఇటువంటి వాటికి మానవ తప్పిదాలు కూడా కొంతమేరకు కారణమే. మానవ చర్యలు వాటి తీవ్రతను పెంచుతున్నాయి. అడవుల నరికివేత వల్ల వర్షాల అసమతుల్యత, నేల ద్రవణం వల్ల వరదలు పెరుగుతున్నాయి. అతిగా నిర్మాణాలు, నగరీకరణ నీటి ప్రవాహ మార్గాలు మూయబడటం వల్ల నగర వరదలు వస్తాయి. నేల, నీరు, గాలి ఇలా అన్నింటినీ కాలుష్యంతో నింపేయడం గ్రీన్‌హౌస్ వాయువులు వాతావరణ మార్పులకు దారితీసి తుపానులు, వర్షపాతం పెరుగుతాయి. భూగర్భ తవ్వకాలు, గనుల తవ్వకం భూకంపాల ప్రమాదాన్ని కొన్నిసార్లు పెంచుతాయి. తీర ప్రాంత దోపిడీ సునామీ, తుపాన్ల ప్రభావాన్ని పెంచుతుంది.

## ప్రపంచ మానవుల కర్తవ్యం

మానవుడు ప్రకృతి వైపరీత్యాలను అరికట్టడానికి చేయాల్సిన ముఖ్యమైన విషయాలు కొన్ని ఉన్నాయి. వాటిని ఆచరిస్తే కొంతలో కొంత ప్రకృతి వైపరీత్యాల నుండి బయట పడవచ్చు. అటవీ సంరక్షణ చేస్తూ చెట్లు నరకకుండా, ఎక్కువగా చెట్లు పెంచాలి. ప్రదూషణ నియంత్రణకు చర్యలు చేపట్టాలి. వాయు, నీటి, భూమి కాలుష్యాన్ని తగ్గించాలి. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి. నీటి సంరక్షణ చేస్తూ భూగర్భ జలాలను పెంచుకోవాలి. వర్షపు నీటిని నిల్వ చేసి, నీటి వృథా నివారించాలి. సౌరశక్తి, గాలి శక్తి వంటి పునరుత్పాదక శక్తుల వినియోగం పెంచాలి. ప్రతి ఒక్కరికీ వాతావరణ మార్పులపై అవగాహన పెంచాలి. ప్రజల్లో పర్యావరణం పట్ల చైతన్యం తీసుకురావాలి. ప్రకృతిని మనం కాపాడితేనే మనల్ని ప్రకృతి కాపాడుతుంది. అప్పుడు వైపరీత్యాలను తగ్గించవచ్చు అనేది అక్షరసత్యం.

**చిన్న కథలు**

హెర్మన్ డార్ఫ్ 'చెంచు' నుంచి
– టి.లలితప్రసాద్

# పుటికింక

తమెస్టర్ వంశానికి చెందిన రవణ్ అనే చెంచు ఉండేవాడు. అతనికి వివాహం జరిగింది కానీ పిల్లలు లేరు. అతను ఒకసారి చాలా అందమైన అమ్మాయిని చూసినపుడు ఆమెను రెండవ భార్యగా చేసుకోవాలనుకున్నాడు, ఆ అమ్మాయి పేరు పుటికింక. ఆమె తన తల్లిదండ్రులతో అడవిలో నివసించేది. రవణ్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారి కుమార్తెను తనకు ఇవ్వ మని అడిగాడు. వారికి ఎటువంటి అభ్యంతరం లేనందున అతను ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె తనతో తన మొదటి భార్యతో నివసించడానికి ఆమెను ఇంట్లోకి తీసుకువచ్చాడు. రవణ్ పుటికంకను తన ఇంటికి తీసుకువచ్చిన రోజు నుంచి అతనికి ఎప్పుడూ తినడానికి పుష్కలంగా ఉండేది. అతను చాలా ధనవంతుడూ అయ్యాడు. పుటికింక ప్రతి ఉదయం, సాయంత్రం ఆమె ఇంటికి చాలా డబ్బు, ఆహారాన్ని తీసుకువచ్చేది. రవణ్‌కు ఇవన్నీ ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదు. కానీ సమయం చాలా బాగా, సంతోషంగా గడిచిపోతోంది. చాలాకాలం ముందు పుటికింకకు ఒక కొడుకు ఉన్నాడు. రవణ్ ఒక బిడ్డను కనడంపట్ల సంతోషించాడు. కానీ అప్పుడయినా పుటికింక తన కొడుకును చూసుకోవడానికి నిర్బంధంలో లేదు. కానీ పిల్లలు లేని మొదటి భార్య సంరక్షణలో అతన్ని వదిలివేసింది.

మొదట్లో అంతా బాగానే జరిగింది. కానీ త్వరలోనే రవణ్ మొదటి భార్య ఫిర్యాదు చేయనారంభించింది. ఎందుకంటే ఆమె ఇంట్లో ఉండి తన భర్త రెండవ భార్య బిడ్డను చూసుకోవడానికి ఇష్టపడలేదు. తల్లి లేనపుడు ఆ పిల్లవాడు చాలా ఏడ్చాడు. మొదటి భార్య "దాని తల్లి అడివికెళ్తే నేను ఈ బిడ్డను ఎందుకు చూసుకోవాలి?" అని కోపగించుకుంది. అప్పుడు నిజంగా ఆత్మ అయిన పుటికింక, అడవిలో చాలా దూరంలో ఉన్న చెంచు మొదటి భార్య చెప్పినదంతా విన్నారు. చాలా కోపంగా వాడు ఇంటికి పరిగెత్తి మొదటి భార్య నుంచి ఆ పిల్లవాడిని తీసుకెళ్లాడు. ఆమె వాడిని బావి దగ్గరకు తీసుకెళ్లి తలను రాయికి కొట్టి చంపింది.

పుటికింక రవణ్ ఇంటికి తిరిగి రాలేదు. కానీ ఆమె నీటి దగ్గరే ఉండిపోయింది. అక్కడ ఆమె తన కొడుకుని చంపింది. రవణ్ చాలా సంతోషంగా ఉన్నాడు. రోజుల తరబడి ఏమీ తినలేదు కానీ పుటికింక కోసం వెతుకుతూ అడవిలో తిరుగుతూ సమయం గడిపాడు. చివరికి చాలా కాలం తర్వాత అతను ఆమెను బావి దగ్గర కలుసుకున్నాడు. తిరిగివచ్చి తనతో మళ్ళీ జీవించమని ఆమెను వేడుకున్నాడు. కానీ పుటికింక అది అసాధ్యమన్నది. అయితే అతను ఎప్పుడూ ఆహారం కోసం ఎదురు చూడకూడదని అతనికి ఎప్పుడయినా అవసరం ఉంటే అతను తన గురించి మాత్రమే ఆలోచించాలని ఆమె అన్నది. ఈ కారణంగానే నేటికీ మహిళలు ఎక్కువ ఆహారాన్ని సేకరించి ఇంటికి తీసుకువస్తారు.

# జంతువులు, భగవంతుడు

ఒకప్పుడు చెంచులకు గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు చాలా ఉండేవి. విందు/వివాహం జరిగినపుడ్లా మేకలను, గొర్రెలను చంపేవారు. చెంచులు విందు చేసిన ప్రతీసారి వాటిలో కొన్నింటిని వధించడం గమనించిన జంతువులు, వారు కలిసి వచ్చి ఎప్పుడూ పట్టుకుని వధించబడకుండా ఎలా నివారించవచ్చో చర్చించుకున్నాయి. అప్పుడు ఆవు, మేక, గొర్రెల భగవంతుని ముందు తమ సమస్యను ఉంచాలనుకున్నాయి. కానీ గేదె ఆ సభకు రాలేదు. మొదట ఆవు భగవంతుని వద్దకు వెళ్లి చెంచులు బెల్లులు, సంచులు, నీటిపీపాల వంటి తోలువస్తువులు ఆశించినపుడల్లా మాదిగలకు ఎప్పుడూ ఆవులను ఇస్తారని ఫిర్యాదు చేసింది. వారు వాటిని వధించి వాటి మాంసాన్ని తింటారు.



భగవంతుడు ఆ ఆవును చూసి "చెంచులు నిన్ను చంపకపోవచ్చు. వారు నీ పాలు మాత్రమే తాగుతారు, కానీ మాదిగలు నిన్ను చంపి నీ మాంసం తినవచ్చు" అన్నాడు. ఆ ఆవు వెళ్లిపోయింది. ఆమె ఈ సమాధానంతో సంతృప్తి చెందకపోవడంతో ఆమె చెంచుల వద్దకు తిరిగి రాలేదు. భగవంతుడు అవుకు ఎలా సమాధానం చెప్పాడో మేక విన్నపుడు "అతను నాతో ఏమి చెబుతాడు? నేను చాలా అందమైన జంతువును, బహుశా అతను నన్ను పట్టుకోవాలనుకుంటాడు" అనుకుంది. కనుక మేక భగవంతుని వద్దకు కూడా వెళ్లకుండానే వెళ్లిపోయింది.

కానీ గొర్రె "ఏం జరిగినా నేను భగవంతునితో మాట్లాడాలి, ఆమె దేవుడి వద్దకు వెళ్లి చెంచులు విందు చేసినపుడల్లా తన జాతికి చెందిన కొన్నింటిని చంపేస్తారని ఫిర్యాదు చేసింది. భగవంతుడు గొర్రెల మాట విని నువ్వు చాలా మంచి జంతువవి తినడానికి చాలా నుంచి జంతువువి, నేను చెంచులను నిందించలేను. నేనే నిన్ను తినాలనుకుంటున్నాను" అన్నాడు. అది విని గొర్రె విచారంగా "వంగిన మెడతో వెళ్లిపోయింది. వధించడానికి తనను తాను అప్పగించుకుంది. అందుకే గొర్రెలు ఎప్పుడూ తలలు వంచుకుని నడుస్తాయి" అని అంది. ■

# ఉప్పునీటి స్నానంతో లాభాలు

ఉప్పు తినడం ఆరోగ్యానికి మంచిదే. కానీ మరీ ఎక్కువగా కాకుండా చాలా మితంగా తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటాం. ప్రస్తుత కాలంలో ఉప్పు తినడం వల్ల గుండె సంబంధిత సమస్యలు, కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. అయితే ఉప్పునీటితో స్నానం చేయడం వల్ల మాత్రం చాలా లాభాలు ఉన్నాయి.

మన రోజువారీ జీవితంలో స్నానం ఒక భాగం. కొంతమంది ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్నానం చేస్తారు. మరికొందరు రోజులో ఒక పూట మాత్రమే స్నానం చేస్తుంటారు. స్నానం చేయడం వల్ల ఒంటిమీద ఉన్న మురికిని తొలగించడమే కాకుండా శరీరానికి రిలాక్సేషన్ దొరుకుతుంది. స్నానం చేసే నీళ్లలో ఉప్పు కలిపి ఆ నీటితో స్నానం చేయడం ఒక చిట్కా కాదు, శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన ఒక గొప్ప వరం.



కొంతమంది స్నానం చేయడానికి నీటిలో కొద్దిగా రోజ్ వాటర్ లేదా పసుపు లేదా పచ్చి పాలు కలుపుతారు. దీనివల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని నమ్ముతారు. అదేవిధంగా చాలా మంది చిటికెడు ఉప్పు కలిపిన నీటితో స్నానం చేస్తారు.

మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి అనేక మినరల్స్‌తో సమృద్ధిగా ఉండే ఉప్పు వంటలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది శరీరానికి కూడా మేలు చేస్తుంది. నీటిలో ఉప్పు కలిపి స్నానం చేయడం వల్ల పరిసరాల నుండి ప్రతికూల శక్తి తొలగిపోవడమే కాకుండా శరీరానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి.

ఉప్పు కలిపిన నీటితో స్నానం చేయడం వల్ల రోజంతా పనిచేసి అలసిపోయిన శరీరానికి ఒక కొత్త ఉత్తేజం వస్తుంది. కండరాల నొప్పులు, కీళ్ల వాపులతో బాధపడుతున్న వారికి ఇది చాలా మంచిది. గోరువెచ్చని ఉప్పునీటి స్నానం మీ కండరాలకు ఉపశమనాన్ని అందించి, నొప్పులను మాయం చేస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరిచి, వాపులను తగ్గించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది.

శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవడంతో పాటు శారీరక శుభ్రత కూడా ముఖ్యం. అందుకోసం ఉదయం, సాయంత్రం స్నానం చేయడం తప్పనిసరి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్నానం చేయడం వల్ల మానసిక ఉత్తేజం కలుగుతుంది. ఉదయం నుంచి పడిన టెన్షన్స్ నుంచి రిలీఫ్ లభిస్తుంది. అయితే మామూలు నీటితో స్నానం చేయడం కన్నా ఉప్పు నీటితో స్నానం చేయడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

ఉప్పు నీటిలోని పోషకాలు..

చర్మంపై ఉన్న మృత కణాలను తొలగించి, చర్మాన్ని మెరిసేలా చేస్తాయని, ఉప్పులో ఉండే మినరల్స్ చర్మంపై ఉండే బ్యాక్టీరియాను నాశనం చేసి అనేక ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతాయని సూచిస్తున్నారు. అలాగే ఎగ్జిమా, సోరియాసిస్ వంటి చర్మ వ్యాధులను తగ్గించడానికి, చర్మంపై దురద తగ్గడానికి ఉప్పు నీటి స్నానం ఉపయోగపడుతుందని అంటున్నారు. స్నానపు నీటిలో ఉప్పు కలిపి స్నానం చేయడం వల్ల చర్మంలో దాగి ఉన్న మురికి శుభ్రమవుతుంది. ఇది మృతకణాలను పూర్తిగా తొలగిస్తుంది. వేసవిలో చెమట వల్ల కలిగే రింగ్‌వార్మ్, దురద మొదలైన చర్మ వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చడంలో కూడా సహాయపడుతుంది.

అంతేకాకుండా ఉప్పులో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. రాళ్ల నుండి తీసిన నీటితో స్నానం చేయడం వల్ల శరీరం నుండి విషాన్ని బయటకు పంపుతుంది. అదనంగా ఇది శరీరంలో మంట, దురద, వాపు వంటి సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

ముందుగా ఒక బకెట్ తీసుకొని దానిని నీటితో నింపాలి. ఈ నీటిలో ఒక టేబుల్ స్పూన్ ఉప్పు వేసి 15 నిమిషాలు అలాగే ఉంచాలి. నీటిలో ఉప్పు కరిగిన తర్వాత స్నానం చేయండి. ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల చర్మానికి మేలు జరగడమే కాకుండా ప్రతికూల శక్తిని తొలగించడంలో కూడా సహాయపడుతుంది. మనమందరం పనిలో చాలా కష్టపడి పనిచేసిన తర్వాత విశ్రాంతి తీసుకోవడానికి ఇష్టపడతాం.

ఉప్పు నీటి ద్వారా మెగ్నీషియం సమృద్ధిగా గ్రహించడం వల్ల శరీరం విశ్రాంతి పొందుతుంది. రాత్రిపూట మంచి నిద్రకు సహాయపడుతుంది.

గోరు వెచ్చటి నీటిలో సాల్ట్ వేసుకుని స్నానం చేయడం వల్ల కండరాలు సడలింపు లభిస్తుందని.. వెన్నుముకపై ఒత్తిడి తగ్గి ఉపశమనం లభిస్తుందని నిపుణులు అంటున్నారు.

నీటిలో ఉప్పు ఉండటం వల్ల గురుత్వాకర్షణ శక్తి తగ్గి, ఫలితంగా కీళ్లు, వెన్నుముకపై ఒత్తిడి తగ్గుతుందని చెబుతున్నారు.

ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల ఫైబ్రోమైయాల్జియా సమస్య కూడా తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. ఫైబ్రో మైయాల్జియా అంటే.. పని ఒత్తిడి, అతిగా కూర్చోవడం, అనారోగ్య ఆహారపు అలవాట్లు వంటి కారణంగా కండరాలు, కీళ్లు, శరీరంలోని వివిధ భాగాల్లో తీవ్ర నొప్పులు వస్తుంటాయి. దీంతోపాటు చాలా మందిలో అలసట, బద్ధకం, నిద్రలేమి కూడా వస్తూ ఉంటుందని అంటున్నారు. ఈ సమస్య నుంచి బయట పడాలంటే ఉప్పు నీటితో స్నానం చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

కేవలం ఆరోగ్యానికే కాకుండా సౌందర్యానికి కూడా ఉప్పునీరు ఒక వరం. ఇది చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను సున్నితంగా తొలగించి, సహజమైన ఎక్స్



ఫోలియేంట్ గా పనిచేస్తుంది. దీనివల్ల చర్మం శుభ్రపడి మరింత కాంతివంతంగా, మృదువుగా మారుతుంది. తామర, దురద వంటి చర్మ సమస్యలతో బాధపడేవారికి ఇది దివ్యౌషధంలా పనిచేసి చికాకును తగ్గిస్తుంది.

అలెర్జీలు, శ్వాసకోశ లేదా సైనస్ ఇన్ఫెక్షన్లు శ్లేష్మం పేరుకుపోవడానికి దారితీస్తాయి, ఇది శ్వాస సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. ఉప్పు స్నానం ఇప్పటికే ఉన్న శ్లేష్మం పేరుకుపోవడాన్ని తొలగించడంలో సహాయపడటమే కాకుండా, దానిని నివారించడానికి కూడా సహాయపడుతుంది.

అలెర్జీలు, ఉబ్బసం, దీర్ఘకాలిక బ్రోన్కైటిస్, సిస్టిక్ ఫైబ్రోసిస్, ఎంఫిసెమా అనేక ఇతర పరిస్థితులకు చికిత్స చేయడంలో ఉప్పు చికిత్స ప్రభావవంతంగా పనిచేస్తుందని క్లినికల్ ట్రయల్స్ లో నిరూపించబడింది. ఇది బాగా శ్వాస తీసుకోవడంలో సహాయపడుతుంది.

మన శరీరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే స్పష్టమైన ప్రయోజనంతో పాటు, ఉప్పుస్నానం ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. వ్యాధికారకాలను తొలగిస్తుంది. హానికరమైన సూక్ష్మజీవులను చంపుతుంది. చర్మంలోని మలినాలను తొలగిస్తుంది. చర్మ ఉపరితలాన్ని సున్నితంగా ఎక్స్ ఫోలియేట్ చేస్తుంది. చర్మాన్ని మృదువుగా చేయడంలో సహాయపడుతుంది. మచ్చలను తొలగించడాన్ని సులభతరం చేస్తుంది. మొటిమలు, తామర, సోరియాసిస్.. ఇలా అనేక చర్మ పరిస్థితులను నయం చేయడాన్ని ప్రోత్సహిస్తుంది.

ఉప్పునీటితో స్నానం చేస్తే దిష్టి తొలగిపోతుందని నమ్ముతారు. ఎందుకంటే ఉప్పుకు ప్రతికూల శక్తులను గ్రహించే శక్తి ఉందని విశ్వసిస్తారు. శాస్త్రీయంగా చూస్తే ఉప్పునీటిలో స్నానం చేయడం వల్ల ప్రతికూల శక్తి తొలగిపోయి, ఉల్లాసంగా, ప్రశాంతంగా ఉంటారని నమ్మకం.

– ఆనంద 'మైత్రేయ'మ్

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

# భారత నౌకాదళానికి అంతరిక్ష కవచం

భారతదేశ అంతరిక్ష పరిశోధనా చరిత్రలో నవంబర్ 2, 2025 బంగారు అక్షరాలతో లిఖించదగిన రోజు. దీనికి కారణం ఈ రోజున భారతదేశపు బాహుబలిగా పిలువబడే అత్యంత శక్తివంతమైన రాకెట్, ఎల్.వి.ఎమ్3ఎమ్5, దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన ఉపగ్రహం జి.ఎస్.ఎ.టి7.ఆర్ (సి.ఎమ్.ఎస్03) ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపింది. ఈ విజయం కేవలం సాంకేతిక సామర్థ్యాన్ని చాటడమే కాదు, అంతరిక్షంలో మన నౌకాదళ శక్తికి అవసరమైన స్వావలంబనను కూడా ధృవీకరించింది. అత్యంత బరువైన, అధునాతనమైన ఈ సమాచార ఉపగ్రహ ప్రయోగం దేశ భద్రతకు ఎంతగానో దోహదపడనుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రయోగ ప్రాముఖ్యతను, రాకెట్ పనితీరును, ఉపగ్రహ లక్షణాలను, దేశ రక్షణపై దాని ప్రభావాన్ని లోతుగా విశ్లేషిద్దాం.

## జి.ఎస్.ఎ.టి7.ఆర్ ఉపగ్రహం-నేవీకి జీవనాడి

జి.ఎస్.ఎ.టి7.ఆర్ ఉపగ్రహం, దీనినే సి.ఎమ్.ఎస్03 అని కూడా పిలుస్తారు. దీని బరువు సుమారు 4,410 కిలోగ్రాములు. ఇది ఇంతవరకు మనదేశపు రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపబడిన అత్యంత బరువైన ఉపగ్రహం.

సముద్రంలో ఉండే నౌకలు, జలాంతర్గాములు, విమానాలు భూమిపై ఉండే మొబైల్ టవర్ల వలె ఒకదానితో ఒకటి అనుసంధానించ బడి ఉండలేవు. సముద్రంలో వేల మైళ్ల దూరం ప్రయాణించేటప్పుడు, వాటికి భూమిపై ఉన్న స్థావరాలతో, ఇతర నౌకలతో నిరంతరం, సురక్షితమైన సమాచారం అవసరం. ఈ సమాచారాన్ని అందించే వంతెనగా ఈ ఉపగ్రహం పనిచేయనుంది.



**పనితీరు:** ఈ ఉపగ్రహం అంతరిక్షంలో దాదాపు 36,000 కిలోమీటర్ల ఎత్తులో ఉండే జియో స్టేషనరీ ఆర్బిట్ (భూస్థిర కక్ష్య) లో స్థిరపడుతుంది. ఈ కక్ష్యలో ఉపగ్రహం భూభ్రమణ వేగానికి అనుగుణంగా తిరుగుతుంది. అందువలన, ఇది భూమిపై ఒకే ప్రాంతంపై ఎల్లప్పుడూ స్థిరంగా ఉన్నట్లు కనిపిస్తుంది. నౌకాదళం భూమిపై ఉండే ఒక కేంద్రం నుండి ఉపగ్రహానికి సిగ్నల్‌ను పంపుతుంది, ఆ ఉపగ్రహం ఆ సిగ్నల్‌ను స్వీకరించి, విస్తృ ప్రాంతంలోని అన్ని నౌకలకు, జలాంతర్గాములకు తిరిగి పంపుతుంది. దీని అత్యంత ముఖ్యమైన అంశం దాని భద్రత. నౌకాదళ సమాచారం అత్యంత గోప్యమైనది, శత్రువులకు చేరకూడదు. ఈ ఉపగ్రహం మల్టీబ్యాండ్ (బహుళ తరంగదైర్ఘ్యం) సమాచారాన్ని పంపే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ ప్రత్యేకమైన సిగ్నల్ రిసీవర్లు, యాంప్లిఫైయర్‌లు వంటి ట్రాన్స్పాండర్స్ కే.యూ.బ్యాండ్, ఇతర తరంగదైర్ఘ్యాలలో పనిచేస్తాయి. ఈ తరంగదైర్ఘ్యాలు శత్రువుల నుండి సమాచారాన్ని కాపాడటానికి అత్యంత వేగంగా, స్పష్టంగా సమాచారాన్ని పంపడానికి వీలు కల్పిస్తాయి. ఈ ఉపగ్రహం అందించే మెరుగైన కమ్యూనికేషన్ వల్ల హిందూ మహాసముద్ర ప్రాంతంలో నౌకాదళ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు సమీక్షించడం, శత్రువుల కదలికలను ముందే పసిగట్టడం, భారీ నౌకల సముదాయాలను ఒకేసారి నియంత్రించడం వంటి వ్యూహాత్మక కార్యకలాపాలు సులభతరం అవుతాయి. ఈ ఉపగ్రహం గతంలో ఉన్న జి.ఎస్.ఎ.టి7 (రుక్మిణి) స్థానంలోకి వచ్చి, దాని సేవలను మరింత మెరుగుపరుస్తుంది. ఈ విధంగా, జి.ఎస్.ఎ.టి7.ఆర్ మన దేశ రక్షణకు, ముఖ్యంగా సముద్ర సరిహద్దుల భద్రతకు, ఒక అంతరిక్ష అస్త్రంగా పనిచేస్తుంది.

## ఎల్.వి.ఎమ్3 రాకెట్ - అంతరిక్ష శక్తికి ఆధారం

జి.ఎస్.ఎ.టి7.ఆర్ ఉపగ్రహాన్ని విజయవంతంగా దాని కక్ష్యలోకి చేర్చిన ఎల్.వి.ఎమ్3 రాకెట్ గురించి తెలుసుకోవడం చాలా అవసరం. ఎల్.వి.ఎమ్3 ను ఇస్రో 'బాహుబలి' లేదా 'హెవీలిఫ్ట్ లాంచర్' అని పిలుస్తారు. అంటే భారీ బరువులను మోయగల వాహనం అని అర్థం. దీని శక్తి దాని మూడు దశల నిర్మాణంలో ఉంది. ప్రతి దశ దానికి కేటాయించిన పనిని పూర్తి చేసి, ఆ తర్వాత విడిపోవడం ద్వారా రాకెట్ బరువు తగ్గి, వేగం పెరుగుతుంది. ఈ రాకెట్ మొత్తం 642 టన్నుల బరువు, 43.5 మీటర్ల ఎత్తు ఉంది. ఈ వాహనం, భూస్థిర కక్ష్యలోకి (జీఈఓ) బదిలీ చేయడానికి అవసరమైన భూస్థిర బదిలీ కక్ష్యలోకి (జీటీఓ) భారీ ఉపగ్రహాలను మోయగల తన శక్తిని మరోసారి నిరూపించింది. గతంలో చంద్రయాన్ 3ని విజయవంతంగా చంద్రుని దక్షిణ ధ్రువం వైపు మోసుకెళ్లిన రాకెట్ తరువాతి విజయవంతమైన ప్రయోగం ఇది. ఎల్వీఎం3 రాకెట్ ఇప్పటివరకు వరుసగా ఏడు విజయవంతమైన ప్రయోగాలను పూర్తి చేసింది.

ఈ ట్రాక్ రికార్డును నిశితంగా పరిశీలిస్తే, ఈ రాకెట్ ఇప్పుడు కేవలం అభివృద్ధి దశలో ఉన్న వాహనం కాదని, ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన, పూర్తిస్థాయిలో పనిచేస్తున్న ఒక భారీమోసే వాహనంగా స్థిరపడిందని స్పష్టమవుతోంది. ఈ విశ్వసనీయత ప్రపంచ అంతరిక్ష వాణిజ్యంలో మన దేశ స్థానాన్ని మరింత పటిష్టం చేయడానికి దారితీస్తుంది.



**మొదటి దశ (ఘన ఇంధనం):** రాకెట్‌కు ఇరువైపులా ఉండే రెండు భారీ బూస్టర్‌లలో ఘన ఇంధనం నింపబడి ఉంటుంది. రాకెట్ బయలుదేరేటప్పుడు భూమి తాలూకు అత్యంత బలమైన గురుత్వాకర్షణ శక్తిని అధిగమించడానికి అవసరమైన భారీ ప్రారంభ శక్తిని ఈ దశ అందిస్తుంది. ఈ శక్తితోనే రాకెట్ సెకన్ల వ్యవధిలో గాలిలోకి లేస్తుంది.

**రెండవ దశ (ద్రవ ఇంధనం):** ఇది రాకెట్ మధ్య భాగంలో ఉంటుంది. ఇందులో ద్రవ ఇంధనం ఉంటుంది. మొదటి దశ పని పూర్తయిన వెంటనే, ఈ దశలోని వికాస్ ఇంజన్లు పనిచేయడం ప్రారంభించి రాకెట్‌ను నిరంతరం వేగవంతం చేస్తాయి. దట్టమైన వాతావరణం నుండి బయటకు వచ్చే వరకు ఈ దశ కీలకం.

**మూడవ దశ (క్రయోజెనిక్ దశ):** ఇది రాకెట్‌లోని అత్యంత క్లిష్టమైన ఆధునిక భాగం. ఇక్కడ క్రయోజెనిక్ టెక్నాలజీ ఉపయోగించబడుతుంది, అంటే లిక్విడ్ హైడ్రోజన్, లిక్విడ్ ఆక్సిజన్ వంటి ఇంధనాలను అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలలో నిల్వ చేస్తారు. ఈ దశ ఉపగ్రహాన్ని సరిగ్గా జియోస్టేషనరీ కక్ష్య వైపుకు చేర్చడానికి అవసరమైన, ఖచ్చితమైన తుది వేగాన్ని అందిస్తుంది. ఎల్.వి.ఎమ్3ఎమ్5 మిషన్‌లో ఇస్రో ఒక గొప్ప సాంకేతిక విజయాన్ని సాధించింది. ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత క్రయోజెనిక్ ఇంజిన్‌ను కక్ష్యలో మళ్లీ మండించి (రీఇగ్నిషన్) విజయవంతంగా పరీక్షించింది. ఈ సామర్థ్యం వల్ల బహుళ కక్ష్య ప్రయోగాలు అంటే ఒకే రాకెట్‌తో పంపే అనేక ఉపగ్రహాలను వేరు వేరు కక్ష్యల్లోకి పంపడం సులభమవుతాయి.

## స్వావలంబన వాణిజ్య ప్రభావం

జి.ఎస్.ఎ.టి7.ఆర్ వంటి భారీ ఉపగ్రహాల ప్రయోగం భారతదేశ అంతరిక్ష కార్యక్రమానికి స్వావలంబనను తీసుకువస్తుంది. జి.ఎస్.ఎ. టి7.ఆర్ వంటి రక్షణ రంగానికి కీలకమైన ఉపగ్రహాలను ఇతర దేశాల రాకెట్ల ద్వారా ప్రయోగించడం వలన, సమాచార భద్రత, వ్యూహాత్మక అంశాలలో కొన్ని అడ్డంకులు, ఆలస్యం ఏర్పడతాయి. సొంతంగా ఎల్.వి.ఎమ్3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టడం వలన మనదేశం తన రక్షణ ఉపగ్రహాలను ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రయోగించాలో పూర్తిగా స్వతంత్రంగా నిర్ణయించుకునే సామర్థ్యాన్ని పొందింది. ఈ వ్యూహాత్మక స్వాతంత్రం దేశ భద్రతకు అత్యంత విలువైనది. ఎల్.వి.ఎమ్3 రాకెట్ నిరంతర విజయాలు, ముఖ్యంగా చంద్రయాన్3, వన్ వెబ్ ఉపగ్రహాల ప్రయోగాల తర్వాత, అంతర్జాతీయంగా భారతదేశానికి మంచి పేరు తీసుకువచ్చాయి. ఇతర దేశాల ఉపగ్రహాలను తక్కువ ఖర్చుతో, అధిక నమ్మకంతో ప్రయోగించడానికి ఎల్.వి.ఎమ్3 రాకెట్ ఒక ఆకర్షణీయమైన వేదికగా మారింది. ఈ వాణిజ్య ప్రయోగాల ద్వారా న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్.ఎస్.ఐ.ఎల్) సంస్థ ద్వారా మనదేశం గణనీయమైన మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. గతంలో 4,000 కిలోల కంటే ఎక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి మన దేశం విదేశీ ప్రయోగ సంస్థలకు ముఖ్యంగా యూరప్ ఏరియాన్‌స్పేస్‌కు భారీ మొత్తంలో డబ్బు చెల్లించాల్సి వచ్చేది.

## ఫ్యూచర్ విజన్ – గగన్‌యాన్

ఎల్.వి.ఎమ్3 రాకెట్ సామర్థ్యం జి.ఎస్.ఎ.టి7.ఆర్‌తో ఆగదు. దీని భవిష్యత్తు ప్రణాళికలు భారతదేశ అంతరిక్ష శక్తిని ఒక కొత్త శిఖరానికి తీసుకెళ్లేలా ఉన్నాయి. అత్యంత ముఖ్యమైన భవిష్యత్తు పాత్ర గగన్‌యాన్ మిషన్‌లో ఉంది. గగన్‌యాన్ అనేది భారతీయ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే దేశపు మొట్టమొదటి మానవ సహిత అంతరిక్ష యాత్ర. ఈ మిషన్ కోసం ఈ రాకెట్‌ను మరింత మెరుగుపరుస్తున్నారు. దీనిని హెచ్.ఆర్.ఎల్.వి (హ్యూమన్ రేటెడ్ లాంచ్ వెహికల్)గా మార్చడానికి ఇంజన్లు, వ్యవస్థలలో అత్యధిక నమ్మకత్వం, భద్రత ఉండేలా అనేక మార్పులు చేస్తున్నారు. రాకెట్ ప్రయోగం సమయంలో ఏదైనా ఎమర్జెన్సీ ప్రమాదం జరిగినా వ్యోమగాములను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి ఈ రాకెట్‌కు ఒక ప్రత్యేకమైన క్రూ ఎస్కేప్ సిస్టమ్‌ను అమరుస్తారు.

## విజయ పరంపరలో కీలక మైలురాయి

ఎల్.వి.ఎమ్3ఎమ్5 రాకెట్ ద్వారా జి.ఎస్.ఎ.టి7.ఆర్ ఉపగ్రహ విజయవంతమైన ప్రయోగం, మన దేశం అంతరిక్ష కార్యక్రమంలో ఒక పరిపూర్ణ విప్లవాన్ని సూచిస్తుంది. ఇది కేవలం సాంకేతిక విజయం కాదు, దేశ రక్షణ అవసరాలను సొంతంగా తీర్చుకునే వ్యూహాత్మక విజయం. ఈ ఉపగ్రహ సేవలు మన నౌకాదళ సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచడం ఖాయం. అదే సమయంలో, ఎల్.వి.ఎమ్3 రాకెట్ మెరుగైన పనితీరు, భారతదేశాన్ని అంతర్జాతీయ అంతరిక్ష వాణిజ్య మార్కెట్‌లో ఒక కీలక శక్తిగా నిలబెడుతూ, భవిష్యత్తులో మానవులను అంతరిక్షంలోకి పంపే మహాకార్యానికి బలమైన మార్గం సుగమం చేసింది. ఈ విజయ పరంపర, 'జై విజ్ఞాన్' స్ఫూర్తితో ముందుకు సాగుతున్న భారతదేశపు శాస్త్రవేత్తల నిబద్ధతకు, ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం.

– డి.జె.మోహన రావు

కథ

# తేనెలో ఈగ

ఆనందుడు సునందుడు మంచి మిత్రులు. ఆనందుడు నిత్యం సంపాదన యావలో ఉండేవాడు. ఆ సంపాదనలో పడి భార్యా పిల్లలను కూడా పట్టించుకునేవాడు కాదు. తాను కూడా సుఖాలను త్యాగం చేసి నిరంతరం ధన సంపాదనలో ఉండేవాడు.

సునందుడు తన జీవితం సాఫీగా సాగడానికి అవసరమైనంత సంపాదిస్తూ నిత్యం భార్యా పిల్లలతో సంతోషంగా గడిపేవాడు.

ఆనందుడు సునందుడిని చూసి వెటకారంగా “శక్తి ఉన్నప్పుడే సంపాదించాలి. వయసైపోయిన తర్వాత జీవితాన్ని అనుభవించలేం” అని ఎంతగానో చెప్పాడు.

ఏదో ఒకరోజు మిత్రుడైన ఆనందుడికి జీవితం విలువ తెలియజేయాలని అనుకున్నాడు. ఒకరోజు సునందుడు ఆనందుడి ఇంటికి ఒక సీసాతో తేనె తీసుకెళ్లి “మిత్రమా! ఇది చాలా శ్రేష్ఠమైన తేనె. ఆరోగ్యానికి మంచిది” అని ఇచ్చాడు.

ఆనందుడు సీసాలో తేనె రుచి చూసి “నిజమే మిత్రమా.. చాలా రుచిగా ఉంది” అని అక్కడ బల్లపై పెట్టాడు.

మిత్రులిద్దరూ లోకాభిరామాయణంలో పడ్డారు. ఇంతలో ఒక ఈగ వచ్చి తేనెలో పడిపోయింది.

ఈ విషయం ఆనందుడు గమనించలేదు కానీ సునందుడు చూసినా చూడనట్టే ఊరుకున్నాడు.

కొంతసేపటికి ఆనందుడు తేనెలో పడ్డ ఈగను తీసాడు. అప్పటికే అది



చచ్చిపోయింది. అప్పుడు సునందుడు ఆనందుడితో “చూసావా మిత్రమా! ఈ ఈగ తనకు కావలసినంత తేనె తాగి ఎగిరిపోతే హాయిగా జీవించేది. అత్యాశతో మొత్తం తాగేయాలని దానిలో దూకేసింది. చివరికి ఊపిరాడక చనిపోయింది. అలాగే ధనం సంపాదించాలి కానీ సంపాదనలో పడి.. పోకూడదు” అన్నాడు.

మిత్రుడి మాటలతో జ్ఞానోదయమై ఆనందుడు సిగ్గుతో తల దించుకున్నాడు.

**- లోగిశ లక్ష్మీనాయుడు**

### మంచిమాట

- అనవసరంగా ఆలోచిస్తే ఆరోగ్యం పాడవుతుంది. ఆలోచన ఆచరణకు పురిగొల్పేదిగా ఉండాలి.
- సుఖానికి దగ్గవ్వాలంటే కష్టాన్ని అనుభవించాలి. ఈరోజు నీది అనుకున్నది రేపు ఇంకొకరి సొంతం కావచ్చు.





## బాలగేయం

### వానపాట

మబ్బు కురిసిందమ్మ
ముత్యాలవాన!
ఆకుల్ని తడిపింది
అందాల వాన!
కొమ్మల్ని కడిగింది
కస్తూరి వాన!
రెమ్మల్ని నెమ్మదిగా
నిమిరేను వాన!
పండ్లు, కాయల్ని
పలకరించింది వాన!
చెట్ల మొదళ్లకు
తలంటింది వాన!
వేళ్లను మురిపాల
ముద్దాడింది వాన!
వానకూ మురిసింది
వనము నెరజాణ!

– బొబ్బిలి శ్రీధరరావు



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**కె.గీత, విజయవాడ**

**ప్రశ్న:** ఎడారుల విస్తరణను ఆపివేయడానికి మార్గం ఉందా?

**జవాబు:** ఎటువైపు చూసినా ఇసుకరేణువులతో కనిపించే ఎడారి ఏడాదికి కనీసం ఆరు కిలోమీటర్లు విస్తరిస్తుందని నిపుణుల అంచనా. మన దేశంలో గుజరాత్, రాజస్థాన్ మొదలైన రాష్ట్రాలలో ఎడారి విస్తరణ కనిపిస్తుంది. ఈ తరహా ఎడారి విస్తరణను అడ్డుకునేందుకు 2002, అక్టోబరులో అడ్వాన్స్‌డ్ జెల్ టెక్నాలజీ(ఇంగ్లండ్ కంపెనీకి చెందిన నిపుణులు ఒక జెల్‌ను తయారు చేసారు. ఇసుకనేలల మీద పొరల్లో వుండే తేమను ఈ జెల్ పట్టి ఉంచుతుంది. జెల్ కారణంగా పైపొర గట్టిగా మారి ఇసుకధూళి కొత్త కొత్త ప్రాంతాలకు విస్తరించడం తగ్గుతుంది. ఇదే సమయంలో మొక్కల విత్తనాలు ఈ జెల్ మీద సాధారణ స్థాయిలో పెరుగుతాయి. రెండు రకాల ప్లాస్టిక్ పదార్థాల సమ్మిళితంగా ఈ జెల్ తయారవుతుంది. ఇసుక నేలల్లోంచి మురుగునీరును సమర్థంగా వెలికి తీసేందుకు కూడా ఈ జెల్ ఉపయోగపడుతుంది. మానవ చర్మం పెరుగుదల కోసం, మందులను నిర్దిష్ట సమయానికి అందించేందుకు అవసరమైన బయోమెడికల్ అప్లికేషన్స్‌ను కూడా ఈ జెల్ ద్వారా సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**సి.మధుసూదన్, హైదరాబాద్**

**ప్రశ్న:** పచ్చలు అంటే ఏమిటి?

**జవాబు:** పచ్చలు(ఎమరాల్డ్) బెరిల్ అనే ఖనిజ రకానికి చెందిన ఆకుపచ్చని రత్నాలు. వీటిని పచ్చలు(మరకతాలు) అని మనం వ్యవహరిస్తున్నాం.





# ఫలించిన స్వప్నం




**నవీ** ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో నవంబరు 2వ తేదీన జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత మహిళా క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా జట్టుపై సమిష్టి కృషితో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లోను అద్వితీయ ప్రతిభ కనబర్చి 52 పరుగుల తేడాతో తొలిసారి ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. 1978లో మొట్టమొదటిసారి ఐసీసీ మహిళల క్రికెట్ పోటీలో అడుగుపెట్టిన భారత మహిళల జట్టు 47 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం 13వ ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం దేశవ్యాప్తంగానే కాక ప్రపంచంలోని వివిధ దేశాలలో నివసిస్తున్న భారతీయులను ఆనందపారవశ్యాలలో ముంచెత్తింది.

## అసాధారణమైన శిక్షకుడు

భారత మహిళా క్రికెట్ జట్టు ఈ అసాధారణ విజయం వెనుక ఒక పురుషుని అదృశ్య కృషి ఉంది. ఆయన మరెవరో కాదు.. భారత ప్రఖ్యాత మేటి బ్యాటర్ సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీల మిత్రుడు, సమకాలీనుడు అమోల్ ముజుందార్. ఆయన కూడా సచిన్ టెండూల్కర్‌ను దేశానికి అందించిన రమాకాంత్ అచ్రేకర్ శిష్యుడే. ప్రశాంతత, సానుభూతిగల నాయకత్వానికి పేరుగాంచిన అమోల్ ముజుందార్ భారత మహిళా క్రికెట్ జట్టులో క్రమశిక్షణ, నమ్మకం, స్థితిస్థాపకతను ప్రేరేపించడం ద్వారా కోచింగ్ విజయాన్ని పునర్నిర్వచించారు. 2014లో రిటైర్ అయిన తర్వాత ఆయన కోచ్‌గా స్థిరపడ్డాడు. భారతదేశంలోని అండర్19, అండర్23 జట్ల శిక్షణతో ప్రారంభమైన అతని ప్రతిభ దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా, ఐపిఎల్ ఫ్రాంచైజ్ రాజస్థాన్ రాయల్స్‌లో బ్యాటింగ్ కోచ్‌గా, నెదర్లాండ్స్ పురుషుల జట్టు కోచ్‌గా అంతర్జాతీయ స్థాయిలకు చేరుకుంది. భారత మహిళా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ పదవి దాదాపు 10 నెలలుగా ఖాళీగా ఉండటంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి అమోల్ ముజుందార్‌ను అక్టోబర్ 2023లో నియమించింది. అంతర్జాతీయ క్రికెట్ పెద్దగా ఆడకపోవడంతో మొదట్లో ఆయన నియామకంపై వివాదం నెలకొన్నప్పటికీ, కోచ్‌గా అతని అద్భుతమైన దేశీయ రికార్డు, నైపుణ్యం స్వల్పకాలంలోనే ఆటగాళ్లతో సహా క్రికెట్ వర్గాలను ఆకర్షించింది. భారత మహిళా జట్టు అద్భుతంగా రూపాంతరం చెంది మొట్టమొదటిసారి 2025 ఐసిసి మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం ఆయన శిక్షణా నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. టోర్నమెంట్ ప్రారంభంలోనే ఓడిపోయినప్పటికీ ఏమాత్రం ఆత్మస్థైర్యం కోల్పోకుండా, పటిష్టమైన ఆస్ట్రేలియా జట్టుపై సెమీఫైనల్‌లో సాధించిన స్ఫూర్తిదాయకమైన విజయం, ఆ తర్వాత దక్షిణాఫ్రికాపై జరిగిన ఫైనల్‌లో చారిత్రాత్మక విజయం భారత జట్టు సమిష్టితత్వానికి, అమోల్ ముజుందార్ శిక్షణా నైపుణ్యానికి గొప్ప మైలురాయిగా నిలుస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. సెమీఫైనల్ మ్యాచ్ సమయంలో “మన జట్టు విజయానికి మరొక పరుగు అవసరం” లాంటి అతని ప్రోత్సాహకరమైన సందేశాలు ఆటగాళ్లను ఎంతగానో ప్రేరేపించాయి. భావోద్వేగంతో కూడిన, దృఢమైన సునిశిత మానవీయమైన నాయకత్వంతో అతను ఆటగాళ్లలో విశ్వాసం పాదుకొల్పడం, జెమిమా రోడ్రిగ్స్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లోకి పంపడం వంటి అతని సాహసోపేతమైన వ్యూహాత్మక నిర్ణయాలతో పాటు క్రాంతి గౌడ్, శ్రీ చరణి వంటి యువ ప్రతిభావంతులకు మద్దతు ఇవ్వడానికి ముజుందార్ చూపిన సంకల్పం సత్ఫలితాన్నిచ్చిందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తమ శిక్షకుడి పట్ల గౌరవంతో కూడిన అభిమానాన్ని చాటుకుంది.

**అమోల్ ముజుందార్:** అంతర్జాతీయ క్రీడాకారుడిగా అవార్డులను అందుకోకపోయినా, కోచ్‌గా అతని అంకితభావం, విజయాలు అసాధారణ మలుపుగా పరిగణించబడు తున్నాయి. అతని ప్రభావవంతమైన నాయకత్వం భారత మహిళా క్రికెట్‌ను ప్రపంచ వేదికపై ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు యువ క్రీడాకారులు, కోచ్‌లకు స్ఫూర్తినిచ్చింది.

భారత మహిళా జట్టు తొలి ప్రపంచ కప్ టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు వారికి తగిన శిక్షణనిచ్చి క్రీడానైపుణ్యంతో పాటు మానసికంగా సంసిద్ధులను చేసిన తీరు భారతదేశ మహిళా క్రికెట్ చరిత్రలో ఒక కీలకమైన మైలురాయిగా నిలిచిపోతుంది. ఉన్నత చదువుల కోసం శారదాశ్రమ విద్యామందిర్‌లో చేరిన అమోల్ ముజుందార్ లెజెండరీ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ ఆధ్వర్యంలో తన క్రికెట్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నాడు.

**(మిగతా 29వ పేజీలో..)**

# నియంత పోకడ వద్దు!

కాలం కలిసి వచ్చిన కొందరు "నేనే సర్వస్వం, నా మాటే శాసనం" అంటుంటారు. వీరిలో నియంత పోకడలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇలాంటివారు కార్పొరేట్ కంపెనీలు, రాజకీయాలలో అక్కడక్కడ కనిపిస్తుంటారు. రామాయణంలో రావణుడు, మహా భారతంలో దుర్యోధనుడు విర్రవీగి పతనం అయ్యారు. ప్రపంచాన్ని జయించాలి.. అనుకున్న హిట్లర్ ఆఖరికి ఆత్మహత్య చేసుకున్నారు.

మన సమాజంలో వ్యక్తిగత విజయాలు, గౌరవం, ప్రాచుర్యం మొదలైన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడుతోంది. ఈ నేపథ్యంలో కొంత మంది వ్యక్తులు, నాయకులు తాము ఇతరుల కంటే ఉన్నతమైన వారుగా ఊహించుకుంటారు. వారసత్వంగా వచ్చిన అవకాశాన్ని స్వయం శక్తిగా భావిస్తుంటారు. ఎప్పటికప్పుడు ప్రశంసలు కోరుకోవడం అలవాటు చేసుకుంటారు, ఇతరుల భావాలను పట్టించకపోవడం మానేస్తారు. తమకే అన్నీ తెలుసు అన్న భ్రమలకు గురవతు ఉంటారు. విపరీతమైన అహం ప్రదర్శిస్తుంటారు. ఇలాంటి లక్షణాలను నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ (ఎన్.పి.డి.) అనే వ్యక్తిత్వ రుగ్మతలా గుర్తించాలి.

నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ అనేది ఒక వ్యక్తిత్వ రుగ్మత. ఇందులో వ్యక్తి తనను అత్యంత ముఖ్యమైనవాడు, ప్రత్యేకమైనవానిగా భావిస్తాడు. ప్రశంసలపై ఆధారపడి జీవిస్తారు. అయితే అంతర్గతంగా తక్కువ ఆత్మవిశ్వాసం కలిగి ఉంటాడు. ఈ రుగ్మత ప్రధాన లక్షణాలు అన్నీ అహంకార పూరితంగా ఉంటాయి. తమను ఇతరుల కంటే గొప్పవారిగా భావిస్తుంటారు. నిత్యం పొగడ్తలు, ప్రశంసలు కోరుకుంటారు. ఇతరుల భావాల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తారు. ప్రతిపక్షం లేదా విమర్శను తట్టుకోలేరు. స్వార్థపరమైన ఆలోచనలు, సంబంధాలలో ఆధిపత్యం ప్రదర్శిస్తుంటారు. అధికారం, ఐశ్వర్యం, అందం, విజయం శాశ్వతం.. అన్న కల్పనా జగత్తులో విహరిస్తుంటారు.

## కారణాలు అనేకం

నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ తలెత్తడానికి పలు కారణాలు ఉంటాయి. బాల్యం, యవ్వనంలో అధిక ప్రశంసలు లేదా అధిక విమర్శలకు గురై ఉంటారు. తల్లి తండ్రుల సంబంధాలలో ప్రేమ రాహిత్యం చవి చూసి ఉంటారు. జన్యువులు, హార్మోన్ల లోపాలు కరణం కావచ్చు. పర్యావరణ ప్రభావాలు, ముఖ్యంగా ప్రోత్సాహం



లేకపోవడం లేదా అతిగా పొగడటం కూడా మూలం కావచ్చు.

ఈ రుగ్మతతో బాధపడేవారు వ్యక్తిగత సంబంధాలను కోల్పోతారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు, సహచరులతో విభేదాలు ఏర్పడతాయి. తమకు కావలసిన గౌరవం లభించకపోతే ఆగ్రహం, అసూయ, ఆత్మన్యూనతా భావం కలగవచ్చు. దీని ఫలితంగా డిప్రెషన్, ఆందోళన, ఒంటరితనం కూడా పెరుగుతాయి.

## చికిత్స అవసరం

నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్‌కు పూర్తి నివారణ కష్టం. అయినా సరైన చికిత్సతో నియంత్రణ సాధ్యం కావచ్చు. సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో మందులు వాడాల్సి ఉంటుంది. సైకోథెరపీ వ్యక్తి తన ఆలోచన విధానాన్ని మార్చుకోవడంలో, ఇతరుల భావాలను అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది.

కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ తప్పుడు విశ్వాసాలు, అహంకారపు ఆలోచనలను సరి చేయడంలో సహాయపడుతుంది. ఇలాంటి వారిలో ఆందోళన, డిప్రెషన్ లక్షణాలు కనిపించినప్పుడు మందులు వాడక తప్పదు. నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ ఒక గంభీరమైన వ్యక్తిత్వ రుగ్మత. సమాజం, కుటుంబం, విద్యా వ్యవస్థ అందరూ సహానుభూతితో, అవగాహనతో, మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. వ్యక్తిని విమర్శించడం కాకుండా సహాయపడటం, చికిత్సకు ప్రోత్సహించడం అవసరం. నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ అనేది స్వార్థం, అహంకారం, భావోద్వేగ లోపం కలిగిన రుగ్మత. కానీ సరైన అవగాహన, సలహా, సైకోథెరపీ ద్వారా వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని సరిచేసుకోవచ్చు. వ్యక్తి "నేనే గొప్ప.." అనుకోవడం అహంకారం. నేను కూడా అనుకుంటే ఆత్మ విశ్వాసం అన్న వివేకం పెంచుకోవాలి. వ్యక్తి చరిత్రపై అవగాహన, సామాజిక స్పృహ పెంచుకుంటే వివేకం పెరుగుతుంది. నలుగురిలో నేను ఒక వ్యక్తి అన్న భావం బలపడుతుంది.

– డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి

కథ

# శాంత అలియాస్

జిల్లేళ్ళ బాలాజీ



**చివరగా... ముఖం ముందున్న స్కార్ఫ్‌ను సగానికి మడిచి కళ్ల కింద నుండి వెనక్కి పోనిచ్చి గట్టిగా రెండు ముళ్లు వేసింది శాంత. తర్వాత కళ్ల కింద గుడ్డను సరిచేసుకుంది. టేబుల్ మీదున్న హ్యాండ్‌బ్యాగును తీసుకుని తగిలించుకుంటూ అద్దంలో ఆఖరిసారిగా ముందుకూ వెనకకూ తిరిగి తనను తాను చూసుకుంది.**

సంతృప్తిగా అనిపించి ఇంటి పెరటివైపున్న తలుపు దగ్గరకు నడుస్తూ "అమ్మా..!" అని గట్టిగా పిలిచింది.

"వస్తున్నా!" అంటూ శాంత తల్లి ఆ గదిలోకొచ్చింది.

"తలుపు గెడియ పెట్టుకో!" అంటూ పెరటి తలుపు గెడియ తీసి తల బయట పెట్టి అటూ ఇటూ చూసింది. సన్నని ఆ పెరటి వీధిలో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక శాంత గబగబ బయటికి అడుగులు వేస్తూ...

"అమ్మా, చెప్పింది గుర్తుంది కదా! ఎవరైనా నా కోసం ఫోన్ చేస్తే బంధువులింటికి వెళ్లానని చెప్పు, సరేనా?" అంటూ ముందుకు దారి తీసింది.

"అలాగే..." కూతురు వెళ్తున్న వైపే ఆశ్చర్యంగా చూస్తూ తలుపు గెడియ పెట్టింది శాంత తల్లి.

శాంత గబగబ నడుస్తూ వీధి చివరి వరకూ వెళ్లి మెయిన్‌రోడ్డును చేరుకుంది. కాసేపటికి ఎదురుగా ఖాళీగా వస్తున్న ఆటోని ఆపింది. "బీచ్‌కెళ్లాలి" అని బేరమేమీ మాట్లాడకుండా లోపల కూర్చుంటున్న వ్యక్తిని చూసి సర్రున ముందుకు పోనిచ్చాడు ఆటోవాలా.

హ్యాండ్‌బ్యాగును తెరిచి అందులో ఉన్న రెండు ఐదు వందల నోట్ల కట్టలూ, చెక్ బుక్కూ, పెన్నునూ ఒకసారి సరిచూసుకుంది శాంత. తాను కలవబోతున్న వ్యక్తిని ఊహించుకుంటూ "ఈసారైనా అతను కనిపిస్తే బావుణ్ణు?" అని మనసులోనే అనుకుంది. మరో పావుగంటలో బీచ్ దగ్గర శాంతను దింపేసి ఆటో వెళ్లిపోయింది.

ఆమె రోడ్డు పక్కనున్న పార్కులోకెళ్లి ఓ రాతి బెంచీ మీద కూర్చుంది. దూరం నుండి మంద్రంగా అలల ఘోష వినిపిస్తోంది. నీళ్లల్లో కొందరు పెద్దలు, పిల్లలు సరదాగా సందడి చేస్తున్నారు. అప్పుడొకటీ.. అప్పుడొకటీ స్కూటర్లు, ఆటోలు, జీపులూ బీచ్ దగ్గరికి చేరుకుంటున్నాయి. వాటిని చూస్తూ కూర్చుంది. పావుగంట గడిచింది. గాలికి రాలిన ఒక నందివర్ధనం పువ్వు దొర్లుకుంటూ శాంత దగ్గరికి వచ్చింది. వంగి దాన్ని చేతిలోకి తీసుకుని జడలో పెట్టుకోబోయింది. తలకు చుట్టుకున్న స్కార్ఫ్ తీస్తేనే తలలో పెట్టుకోగలదు. తీస్తే, తను ఎవరో బయటివాళ్లకు తెలిసిపోతుంది.

అందుకని ఆ ఆలోచనను మానుకుని దాన్ని వాసన చూసింది. ఎంత హాయిగా ఉందో? సరదాగా

రెండు వేళ్లమధ్య పువ్వును పట్టుకుని అటు ఇటు తిప్పుతూ కూర్చుంది. అప్పుడప్పుడూ వాసన పీలుస్తోంది. ఏదో గుర్తుకొచ్చినట్టుగా హ్యాండ్ బ్యాగును తెరిచి లోపలున్న మొబైల్‌ను బయటికి తీసి ఆన్ చేసింది. గ్యాలరీలోకెళ్లి ఒక ఫోటోను సెలెక్ట్ చేసుకుని దాన్ని జూమ్ చేసింది. అందులో... ఓ గుడి కనిపిస్తోంది. అక్కడ ఒక పదిహేనేళ్ల అమ్మాయి ఓ అంగడి ముందు నిలబడి యాత్రికుల దగ్గర నుండి చెప్పుల్ని తీసుకుని చిరునవ్వుతో టోకెను ఇస్తోంది. శాంత ఆ ఫోటోనే చాలాసేపటిదాకా చూస్తూ ఉండిపోయింది.

"అప్పుడెలా ఉండేది. సన్నగా, బక్కబక్కగా, చిరిగిన బట్టల్తో, చింపిరి జుత్తుతో...పేదరికానికి నమూనాలా... మరిప్పుడు? ఈ ఐదేళ్లలో తను ఎంతగా మారిపోయింది. తమ కుటుంబంలోని అందరి జీవితాల్లోనూ ఎంత మార్పు వచ్చింది. ఆలోచనల్లో పడిపోయి సమయం గడిచిందే తెలియలేదు శాంతకు. ఫోన్ ఆఫ్ చేసి చుట్టూ చూసింది.

దూరంగా... ఒక ఫొటోగ్రాఫర్ చెట్లకొమ్మల్లో దేన్నో ఫొటో తీస్తున్నాడు.

ఆమె పెదాలపై చిరునవ్వు మొలిచింది. లేచి నిలబడి అతనికేసి నడిచింది. అతను కంటి ముందరున్న దృశ్యాన్ని కెమెరాలో పర్‌ఫెక్షన్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో "నమస్కారం సార్!" అంటూ అతణ్ణి పలకరించింది శాంత.

నోటి చివర పెదాల మధ్య ఉన్న సిగరెట్‌తో తల తిప్పి శాంత వంక చూశాడు ఆ ఫొటోగ్రాఫర్. "సార్! మీరు ఆనంద్‌సాయి గారు కదూ?!" చేతులు జోడించి అడుగుతున్న శాంతను చూసి "ఔనన్నట్టుగా.." తలూపాడు.

"మీతో ఓ ఐదు నిమిషాలు మాట్లాడవచ్చా?" అని మర్యాదపూర్వకంగా అడుగుతున్న ఆమెను చూస్తూ కెమెరాను చాతీ మీదకు జార్చి నోట్లో ఉన్న సిగరెట్‌ను వేళ్లతో పట్టుకుని బయటికి తీసి "తప్పకుండా!" అన్నాడు.

తన మొబైల్‌ను ఆన్ చేసి గ్యాలరీలోకెళ్లి తాను ఇందాక చూసిన ఫొటోను చూపిస్తూ... "దీన్నొకసారి చూడండి.." అంటూ అతని చేతికందించి అతని పక్కకెళ్లి నిలబడింది. ఆ ఫొటోను చూసేకొద్దీ అతని పెదాలపై చిరునవ్వు విరిసింది.

"ఇది నేను తీసిందే!" అన్నాడు ఎంతో ఆసక్తిగా.

"ఏముంది అందులో అంత గొప్పగా!" అతని ముఖంలో ఏదో వెతుకుతున్నట్టుగా అడిగింది శాంత.

"మామూలు కళ్లకు అది కనిపించదు. నేను చూశాను. గుడి దగ్గర నిరాడంబరంగా నిలబడున్న ఆ అమ్మాయి కళ్లల్లో ఆ సేవాభావం, చెరగని చిరునవ్వు, మనుషులంటే ఎంత ప్రేమో ఆ అమ్మాయికి! భక్తుల చెప్పులను ఎంతో సహజంగా తీసుకుని గూట్లో పెడుతున్నప్పుడూ, అక్కణ్ణించి తీసి ఇస్తున్నప్పుడూ ఎంతో శ్రద్ధగా, భక్తితో చెయ్యటం నన్ను బాగా ఆకర్షించింది. అంత చిన్న వయసులో అంతటి పరిణతి నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. అందుకే ఆ అమ్మాయి ఫొటో తీశాను. నేనప్పుడు స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే ఆ ఇంగ్లీషు దినపత్రికకు పంపగానే మరునాడే ప్రచురించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అదేరోజు దాన్ని చాలా తెలుగు దినపత్రికలు ప్రచురించాయి. ఆ అమ్మాయి ముఖంలో అంతటి భవ్యమైన ఆకర్షణ ఉంది" అన్నాడు ముక్తాయింపుగా.

**"మీతో ఓ ఐదు నిమిషాలు మాట్లాడవచ్చా?" అని మర్యాదపూర్వకంగా అడుగుతున్న ఆమెను చూస్తూ కెమెరాను చాతీ మీదకు జార్చి నోట్లో ఉన్న సిగరెట్‌ను వేళ్లతో పట్టుకుని బయటికి తీసి "తప్పకుండా!" అన్నాడు.**

"ఆ అమ్మాయిని నేనే!" అంది శాంత.

"ఈజిట్?" అన్నాడు ఆ అమ్మాయి వైపు చూసి ఆశ్చర్యపోతూ.

"ఔనన్నట్టుగా.." తలాడించి ముఖానికి అడ్డుగా ఉన్న స్కార్ఫ్‌ను పక్కకు తొలగించింది. అతను ఆమెను పైనుండి కిందిదాకా పరీక్షగా చూస్తూ "ఆ అమ్మాయి మీరేనంటే నమ్మలేకపోతున్నాను. అస్సలు గుర్తుపట్టలేకపోతున్నాను" అన్నాడు ఆశ్చర్యం నుండి ఇంకా తేరుకోకనే.

అతని మాటలకు ఆమెలో నిలువెల్లా నిరుత్సాహం ఆవరించింది. అప్పటిదాకా ఆమెలో నిండి ఉన్న ఆసక్తి, హుషారంతా పాలపొంగులా బుస్సున చల్లారిపోయింది.

"ఫొటోలోని అమ్మాయి తానేనంటే గుర్తుపట్టలేకపోతే పోనీలే అనుకోవచ్చు. కానీ తాను ప్రస్తుతం ఎవరో, ఏమిటో కూడా కనిపెట్టలేకపోతున్నాడే?.." అనుకుంటూ నిదానంగా మళ్లీ స్కార్ఫ్‌ను ముఖానికి అడ్డుగా కట్టుకుంది. "రియల్లీ సర్‌ప్రైజింగ్‌గా ఉంది. ఇప్పుడేం చేస్తున్నారు?" అని అడుగుతున్న అతని ప్రశ్న విని దీర్ఘంగా నిట్టూర్చింది.

"నా ఫొటో పేపర్‌లో ప్రచురించే సమయానికి మా ఇంటి ఆర్థిక పరిస్థితి అస్సలేమీ బాగాలేదు సార్. అమ్మ కూలిపనికి వెళ్లేది. నాన్న తన పోలియో కాళ్లతో ఏ పనికీ వెళ్లలేని నిస్సహాయ్యుడైపొయ్యాడు. ఎవరో పుణ్యాత్ముడి సహాయం వల్ల నాన్నకు గుడి దగ్గర చెప్పులు భద్రపరిచే పని దొరికింది. భక్తులిచ్చే ఐదూ పదీ రూపాయలతో పాటు, అమ్మ కూలి డబ్బులే మాకు ఆధారం.

మూడు పూటలా తిండి తినటానికి కూడా ఇబ్బంది పడేవాళ్లం. నాకు చదువు కొనసాగించటం కష్టంగా అనిపించింది. చదువు మానేద్దామనుకున్నాను.

కానీ నాన్న నన్ను చదువు మానొద్దని బలవంతంగా బడికి పంపేవాడు. సెలవు రోజుల్లో నాన్నకు సాయంగా ఉండాలని గుడి దగ్గరికి వెళ్లేదాన్ని. ఎంతో భక్తి శ్రద్ధలతో వచ్చే యాత్రికులను చూసి మా కష్టాలన్నింటినీ నాలోనే దాచుకుని వాళ్లతో నవ్వుతూ మాట్లాడటం అలవాటు చేసుకున్నాను. ఎన్ని బాధలు మదిలో సుడులు తిరుగుతున్నా చిరునవ్వును మాత్రం చెదరనివ్వకుండా వాళ్లతో మాట్లాడేదాన్ని.

"అంత చిన్నవయసులో అలాంటి భావన ఎంతో గొప్పది. పది మందిలో పనిచేస్తున్నప్పుడు అలాంటి హావభావం చాలా అవసరం కూడానూ. అయితే అది ఎక్కడా నాకు కృత్రిమంగా అనిపించలేదు. ఆ చిరునవ్వు ఎంతో సహజంగా ఉండి నన్ను ఇట్టే ఆకట్టుకుంది. దాంతో నేను నీ ఫొటో తీసి మా పత్రికలో ప్రచురితమయ్యేలా చేశాను.

మధ్యలో కల్పించుకుని అన్నాడు ఫొటోగ్రాఫర్. "అందుకు మీకు ధన్యవాదాలు సార్. అలా పత్రికల్లో ప్రచురితమైన ఆ ఫొటో చాలామందికి నచ్చినట్టుంది. ఎందరో నన్ను వెతుక్కుంటూ వచ్చి పలకరించే వాళ్లు. మా పరిస్థితి తెలుసుకుని తోచిన సాయం చేసేవాళ్లు. అది నాకెంతో ఇబ్బందిగా అనిపించేది.

అది నాకెంతో ఇబ్బందిగా అనిపించేది. ఉచితంగా అలా డబ్బులు తీసుకోవటం నాకు నచ్చేది కాదు. ఏదైనా పని కల్పించమని అడిగేదాన్ని. అలాంటి పరిస్థితుల్లో, ఒక ప్రముఖ వాణిజ్య సంస్థ నా చిరునవ్వుకు ఆకర్షింపబడి నన్ను మోడల్‌గా పెట్టి ఒక యాడ్ తీసి రిలీజ్ చేశారు.

దాన్ని చూసి డైరెక్టర్ రాజీవ్‌గారు నన్ను తన సినిమాలో హీరోయిన్‌గా నటించమని కోరారు. మా అమ్మా నాన్నలు మొదట అంగీకరించకపోయినా చివరకు ఒప్పుకున్నారు. ఆయన తీసిన నా మొదటి సినిమా సూపర్ హిట్ కావటంతో నేను మరి వెనక్కు చూసే అవసరం లేకపోయింది. ఈ ఐదేళ్లల్లో ఎందరో ప్రముఖ హీరోలతో పాటు ఇతర భాషా సినిమాల్లోనూ నటించాను. నా చివరి రెండు సినిమాలు హిందీలోనే నటించాను.

ఐదేళ్లల్లో దాదాపు ఇరవై సినిమాల్లో నటించాను. లక్షల రూపాయల పారితోషికం నుండి కోట్లకు పెరిగింది నా సంపాదన. ఇంతటి స్థాయికి ఎదగటానికి కారణం మీరే! మీరే కనుక ఆ ఫొటో తియ్యకపోయి ఉంటే, నేనీ స్థాయికి చేరుకునేదాన్నే కాను. ఎలాగైనా మిమ్మల్ని కలుసుకుని నా కృతజ్ఞతలను తెలియజేయాలని మీకోసం ఎంక్వయిరీ చేశాను.



తెలుగు పత్రికల నుండి సరైన సమాధానం రాలేదు. అప్పుడే మీరు ఆ ఇంగ్లీషు పత్రికలో పనిచేసినట్టు తెలిసింది. కానీ, ప్రస్తుతం అక్కడ కూడా మీరు పనిచెయ్యటం లేదని తెలిసి ఎంతగానో నిరుత్సాహపడ్డాను. అయినా మిమ్మల్ని ఎలాగైనా కలవాలని తీవ్రంగా ప్రయత్నించగా మీ ఆచూకీ తెలిసి ఇవ్వాళ మిమ్మల్ని కలుసుకునే అదృష్టం లభించింది” అని అంటున్న ఆమె మాటలకు అడ్డుపడుతూ– “యాంత్రికమైన ఆ జీవితానికి విసుగొచ్చి ఆ ఇంగ్లీషు పత్రిక నుండి బయటికొచ్చేశాను. ఫ్రీలాన్స్ ఫోటోగ్రాఫర్‌గా చెయ్యమని చాలా పత్రికలు అవకాశమిస్తానన్నాయి. అయినా నేను అంగీకరించలేదు. స్వయంగా ఓ చిన్న ఫొటో స్టూడియోను పెట్టుకుని ఖాళీ సమయాల్లో ఇలా నాకు నచ్చిన ఫొటోలు తీస్తుంటాను” సంతృప్తిగా చెప్పాడు ఫోటోగ్రాఫర్.

“ఎవరికీ తెలియని ఒక మామూలు మనిషిగా ఉన్న నన్ను ఇంతటి తారా స్థాయికి చేర్చి, మా కుటుంబానికి మెరుగైన ఆర్థికస్థితి కలిగేలా చేసిన మీకు నేనెలా రుణం తీర్చుకోవాలా అని ఆలోచించాను? మీరేమీ అనుకోనంటే నా సంతోషం కోసం ఈ బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను. దయచేసి కాదనకండి” అంటూ హ్యాండ్‌బ్యాగు తెరిచి లక్ష రూపాయల డబ్బును తీసి ఇవ్వబోయింది. అతను ఆ డబ్బును తీసుకోకుండా ఆమెను చూస్తూ చిరునవ్వు నవ్వాడు. “మీకు ఇంకా ఎంత కావాలన్నా ఇస్తాను. మీకివ్వటం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తుంది” అంటూ చెక్‌బుక్‌ను చేతిలోకి తీసుకుంది. అతను తలను అడ్డంగా ఊపుతూ

“నేను మిమ్మల్ని ఫొటో తీసినందుకు నాకు ఆ పత్రికవాళ్లు జీతమిచ్చారు. దాంతో నా పని అయిపోయింది! ఇక మీరు ఈ స్థాయికి రావటానికి నేను కారణం కానే కాదు, మీ స్వయంకృషే కారణం. ఎంతో కష్టపడి అంచెలంచెలుగా ఈ స్థాయికి చేరుకున్నారు. మీ విజయానికి మీరే కారకులు. అయినా ఈ స్థాయికి రావటానికి నేను కారణమని భావించి నన్ను కలుసుకుని మీ కృతజ్ఞతలను తెలియజేశారు. నాకది చాలు” అన్నాడు.

తృప్తిగా “ప్లీజ్ సార్ నా సంతృప్తి కోసం మీరు కాదనకుండా దీన్ని తీసుకోండి” అంటూ బలవంతంగా డబ్బును ఇవ్వబోయింది.

అతను సున్నితంగా తిరస్కరిస్తూ, “నాకు ఉచితంగా ఎవరి నుండైనా డబ్బులు తీసుకోవటం ఇష్టం ఉండదమ్మా... నీ దగ్గరే ఉంచు. ఏమీ అనుకోకు... ఉంటాను” అంటూ అతను దూరంగా పిల్లలు ఆడుకుంటున్న వైపుకు దారితీశాడు.

అతని చర్యకు నిర్ఘాంతపోయింది. నిరుత్సాహంగా డబ్బునూ, చెక్‌బుక్కునూ హ్యాండ్‌బ్యాగులో పెట్టి జిప్ వేసింది. పార్కు బయటికి నడుస్తూ తల తిప్పి అతనివైపు చూసింది. జారుడుబల్ల మీదనుండి ఓ చిన్నారి ఆనందంగా కిందికి జారుతూ ఉండటాన్ని జూమ్‌చేసి ఫొటో తీసే పనిలో నిమగ్నమై ఉన్నాడు ఆ ఫోటోగ్రాఫర్.

రోడ్డు మీదికి చేరుకుని ఆటో కోసం చూసింది. అక్కడ ఆటోలేవీ లేవు. ఐదు నిమిషాలు గడిచినా ఒక్క ఆటో కూడా ఎదురవ్వలేదు. బయట ఎండ మాడ్చేస్తోంది. ఉఫ్‌మంటూ నిట్టూరుస్తూ చుట్టూ చూసింది. రోడ్డుకు అవతలి వైపున ఓ చెప్పులు కుట్టే ముసలివ్యక్తి బాగా వంగిపోయి నేల మీద కూర్చుని ఉన్నాడు. కణకణలాడుతున్న ఆ ఎండలో నీడకోసం ఆ ముదుసలి ఒక గొడుగును నిలబెట్టి ఉన్నాడు. కానీ అది బాగా చిరుగులు పట్టి కనిపిస్తోంది. అతని ఒంటిమీద బట్టలు కూడా చిరిగిపోయి ఉన్నాయి. అప్పుడు ఓ కస్టమర్ వచ్చి ఇచ్చిన చెప్పును జాగ్రత్తగా తీసుకుని కుట్టటం మొదలుపెట్టాడు. ఎండ చుర్రుమంటూ అతణ్ణి కాల్చేస్తున్నా పట్టించుకోకుండా తన పనిలో నిమగ్నమయ్యాడు.

“ఈయన ఈ వయసులోనూ ఎవరి మీదా ఆధారపడి బతకటం లేదు. తన స్వశక్తినే నమ్ముకున్నాడు. ఇతనికి కొంత సాయమందితే ఈయన జీవితం మెరుగు పడొచ్చు. ఆ సాయం నేనే అందిస్తే!” అనుకుంటూ రోడ్డును దాటి అవతలి వైపుకు ఉత్సాహంగా వెళ్లింది శాంత అలియాస్ సినీ నటి శ్రీరాగ.

# త్రిలాంగ్-తెలింగాణా-తెలుగు

శ్రీనాథుడు 1385-1475 సంవత్సరాల మధ్య జీవించిన మహాకవి. తెలుగు దేశాన్ని కీర్తిస్తూ మొట్టమొదటిసారిగా కవిత్వం చెప్పింది శ్రీనాథకవి సార్వభౌముడు. భీమఖండంలో ఆంధ్రదేశాన్ని కీర్తించాడు. కాశీఖండంలో వారణాసికి ఉన్న ప్రాముఖ్యాన్ని, శ్రీనాథుడు భీమ ఖండంలో త్రిలింగ దేశానికి సమకూర్చాడు. కాశీఖండంలో వ్యాసుడు ఉత్తర భారత వర్ణనను అనుసరించిన విధానానికి ముగ్ధుడైన శ్రీనాథుడు- గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదీ జలాలచే పునీతమైన ఆంధ్రదేశానికి ఆ పవిత్రాన్ని కల్పించడానికి భీమ ఖండాన్ని రచించి ఆంధ్రదేశ ప్రశస్తిని గానం చేసాడు. ఆంధ్రదేశంలో అదే ఒక్క తాళపత్ర ప్రతి లభించింది. అది లండన్ ఇండియాహౌస్ గ్రంథాలయంలో ఉన్నట్లుగా, ఇండియా హౌస్ సంస్కృత గ్రంథాలయ పట్టీలో పేర్కొనబడింది. శ్రీనాథుని ఆంధ్రాభిమానం బృహత్తరం. తెలుగునేలను అమితంగా ప్రేమించిన ఉత్తమ మహాకవి శ్రీనాథుడు. ఆ రోజులలో భారతావనిలో సంస్కృత సరస్వతీదేవికి ఉన్న గౌరవ సత్కారాలు ఆంధ్రభారతికి కూడా గడించి గణింపులోకి తెచ్చిన మహాకవి.




రాజభాషగా సంస్కృతం ఉన్న కాలంలో కూడా ప్రజల భాష అయిన తెలుగు అభివృద్ధి చెందుతూనే వుంది. తెలుగుభాషలో కంద, సీస, గీత, పద్య సాహిత్యం వ్యాప్తిలో ఉంది. శాతవాహనుల తర్వాత పరిపాలించిన ఇక్ష్వాకుల శాసనాలలో మొట్టమొదటగా తెలుగు మాటలు కనపడుతున్నాయి. ఆంధ్రులు దక్షిణాపథంలో ప్రవేశించిన ప్రారంభ ప్రాచీన కాలంలో వింధ్యపర్వత ప్రాంతాలలో నివసించారు. గంగా, యమునా తీరానికి చేరకముందే ఆంధ్రులు బెలూచిస్తాన్, అఫ్ఘనిస్తాన్, కాశ్మీర్‌లలో కూడా ప్రయాణం చేసిన చారిత్రక ఆధారాలున్నట్టు చరిత్రకారులు భావించారు. ప్రాచీన 'దేశి' తెనుగు, నాగ యక్ష ప్రజల తెలుగు రెండూ కలిసి ఒకే భాషగా రూపొందాయి. ప్రాకృత జన్యమైన హిందీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ వంటి భాషల కంటే ద్రావిడ భాషలైన తమిళ, కన్నడ, తెలుగు భాషలు సుదీర్ఘ చరిత్రలో కాల అఘాతాలను తట్టుకొని రూపొందాయి. మొదట ఒక తెగ పేరుగా ఉన్న ఆంధ్ర-పదం వేయి సంవత్సరాల చారిత్రక పరిణామాల ఫలితం తెలుగుకు వర్తించసాగింది. క్రమేపీ ఆంధ్రులు, ఆంధ్రదేశం, ఆంధ్రభాష, తెలుగువారు, తెనుగుదేశం, తెనుగు భాష పర్యాయపదాలుగా మారిపోయాయి. చాళుక్యుల కాలంలో ప్రారంభమైన ఆంధ్రాభిమానం కాకతీయుల కాలంలో వెల్లివిరిసింది. వింధ్యపర్వతాలు దాటి కిందకు దిగిన చారిత్రక సంచారంలో ప్రాచీన ఆంధ్రులు మొట్టమొదట జాతిగా నేటి మరాట్వాడా ప్రాంతంలోను, ఆ పిదప తెలింగాణా ప్రాంతాలలో రాజ్యం స్థాపించారు. కాలక్రమేణా కృష్ణా, గోదావరి ప్రాంతానికి రాజ్యం విస్తరించింది. శ్రీశైల, కాళేశ్వర, ద్రాక్షారామ పవిత్ర శివక్షేత్రాల కారణంగా కాకతీయ సామ్రాజ్యానికి త్రిలింగమనే ఖ్యాతి పొందింది. కాకతీయుల కాలం నాటికి తెలుగుదేశం త్రిలింగ పాలనాధిపత్యంగా ఒకే గొడుగు కిందకు వచ్చింది. రుద్రమ మహారాజ్ఞి తొలి తెలుగు రాణిగా ప్రశస్తి పొందింది. మధ్యయుగం నాటి చరిత్రకారుడు ఫెరిస్టా (1550-1612) హింద్ దేశానికి పుత్ర సంభావితంగా దక్కన్ పీఠభూమి మరాటా, కన్నార్, 'తిలాంగ్'గా అభివర్ణించారు. ఆ విధంగా ప్రస్తుత మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రాంతాలు దక్కన్ అంతర్భాగాలయ్యాయి. తెలింగ అంటే తెలుగు, తెలుంగు. ఆణియం అంటే ప్రదేశం, సరిహద్దు. తెలింగాణా పదం ఆ విధంగా పుట్టింది.

"తెనుగన రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" అని రాజరాజనరేంద్రుడు, నన్నయ భట్టును అడిగిన ప్రస్తావన ఉంది. 'తెనిగింపగంటిని' అంటాడు ఆది అనువాద మహాకవి నన్నయ. తెలుగు భాషా మాధుర్యం, సంకుచిత్వం లేని కలగొలుపు భాషగా, అత్యంత సౌలభ్యంగా ఏ భాషనైనా కలుపుగోగల అక్షర ఔదార్యం గల మన మాతృభాషకు ప్రస్తుతం అడుగంటిపోయే కాలం సంప్రాప్తించింది. సైన్స్, వైద్యం, ఇంజినీరింగ్ సాంకేతిక బోధనా భాషగా ప్రపంచంలో ఏ భాషతో అయినా సరితూగగల సామర్థ్యం వున్న తెలుగు ప్రస్తుత విద్యా విధానంలో నిరాదరణకు గురి అవుతోంది. ప్రపంచంలో అత్యాధునిక, అధునాతన సాంకేతిక ఆంగ్ల మాధ్యమం రాజ్యం చేస్తోంది.

ఉద్యోగ, ఉపాధి రంగాలలో యువతరం దారులు వెతుక్కోవలసి వస్తోంది. సహజంగా తల్లిదండ్రులకు పిల్లల భవిష్యత్ దృష్ట్యా భాష గురించి పట్టింపు కంటే విద్య ద్వారా సాధించగల సంపన్న ఉద్యోగ అవకాశాలపై శ్రద్ధాసక్తులు చూపించక తప్పదు. పల్లెలలో, పట్టణాలలో, నగరాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో యథా ప్రజా తథా రాజ్యంగా తెలుగు మాధ్యమం నిరాశ, నిస్పృహలు ఎదుర్కొంటోంది. రచయితలు, కవులు, సాహితీవేత్తలు, మాతృభాషాభిమానులు కేవలం సాహిత్యసృష్టితో పాటు, భవిష్యత్ తరాలు తెలుగును త్రోసి రాజనకుండా ఉండే స్థితిగతుల రూపకల్పనకు మార్గాలను ఆలోచించాలి. ప్రభుత్వాలను మేల్కొలపాలి. ప్రతీ యింటా మాట, రాత, చదవటం ఉద్యమ చైతన్యంగా తెలుగు జెండా ఎగరాలి.

- జయసూర్య

# యవ్వన మార్పుల ప్రతిధ్వని

యువత ప్రతి కాలంలో సమాజానికి దారిచూపే శక్తిగా నిలుస్తుంది. నాటి నుంచి నేటి వరకు వారు అనుసరించిన జీవనపోకడలు విస్తారమైన మార్పులను చవిచూశాయి. యాభై సంవత్సరాల కిందట యువత జీవన విధానం సాధారణత, పరిమిత అభిలాషలు, క్రమబద్ధమైన కృషితో నిండి ఉండేది. కుటుంబ విలువలు, సామాజిక బాధ్యతలు, గ్రామీణ వాతావరణం, విద్యావ్యవస్థ పరిమిత సాధనాల ఆధారంగా రూపుదిద్దుకున్న జీవితం వారికి మార్గదర్శకత్వం చూపేది. ఆ సమయంలో కలలు సాధారణంగా ఉద్యోగం సంపాదించడం, కుటుంబాన్ని నిలబెట్టడం, సమాజంలో గౌరవప్రద స్థానాన్ని పొందడం చుట్టూ తిరుగుతుండేవి.

నేటి యువతను పరిశీలిస్తే ఆ మార్పు ఎంత విశాలమైందో స్పష్టమవుతుంది. సాంకేతిక విప్లవం, సమాచార ప్రవాహం, గ్లోబలైజేషన్, పట్టణీకరణ ప్రభావం నేటి యువత ఆలోచనల్లో కొత్త మలుపు తిప్పాయి. ఒకప్పుడు చదువు అంటే పాఠశాల, కళాశాల వరకు పరిమితం కాగా, ఇప్పుడు ఆన్‌లైన్ విద్య, అంతర్జాతీయ అవకాశాలు, ఉద్యోగ వైవిధ్యాలు వంటి ఎన్నో మార్గాలు వచ్చాయి. కొత్త వృత్తులు, కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక రంగాలు యువతను కొత్త స్థాయికి చేర్చాయి. ఒకే చోట ఒకే విధంగా బతకడం కంటే ఇప్పుడు వారు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను అన్వేషిస్తూ ముందుకు సాగుతున్నారు.



గతంలో యువత పెద్దల మాటలకే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చి, వారి సూచనలతోనే అడుగులు వేస్తుండగా, నేటి యువత స్వీయ నిర్ణయాలకు, వ్యక్తిగత స్వేచ్ఛకు, వ్యక్తిత్వాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్థిక స్వాతంత్రం, వ్యక్తిగత అభిరుచులు, జీవితాన్ని స్వయంగా రూపుదిద్దుకునే తపన నేటి యువతలో స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవైపు పూర్వం ఉన్న సాంప్రదాయ ఆచారాలు మసకబారుతున్నా, మరోవైపు కొత్త విలువలు, సామాజిక అవగాహన, పర్యావరణ చైతన్యం, స్త్రీపురుష సమానత్వం వంటి అంశాలు బలంగా ఆవిర్భవిస్తున్నాయి.

ఈ మార్పులు భారతదేశ సమాజాన్ని లోతైన స్థాయిలో ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో యువత ఆవిష్కరణలతో నూతన అవకాశాలు పెరిగాయి. ఒకప్పుడు కేవలం ఉద్యోగులపై ఆధారపడిన దేశం, ఇప్పుడు స్టార్టప్‌లు, వ్యాపారవేత్తలు, ఆవిష్కర్తలు ఆధారంగా ముందుకు సాగుతోంది. అదే సమయంలో భిన్నమైన జీవనశైలులు, విలాసపూర్వకత, వినియోగపు అలవాట్లు పెరగడం వలన సంప్రదాయ ఆచారాలపై ఒత్తిడి పెరిగింది. గ్రామీణ జీవనశైలి, సంయుక్త కుటుంబాల విధానం, పంచాయితీ స్థాయి సామాజిక బంధాలు క్రమంగా తగ్గిపోయాయి.

అయినా ఈ పరిణామాలు మొత్తం ప్రతికూలంగా మాత్రమే ఉండవు. నేటి యువతలో ఉన్న సృజనాత్మక శక్తి, సామాజిక బాధ్యతలపై ఉన్న అవగాహన, శాస్త్రీయ దృష్టి, ఆధునిక సాంకేతిక వినియోగం దేశాన్ని ప్రపంచంలో ముందంజలో నిలబెడుతున్నాయి. నేటి యువత సమస్యలను భిన్నంగా అర్థం చేసుకుంటూ, కొత్త పరిష్కారాలను అన్వేషించే ధోరణి చూపిస్తున్నారు. వారి కలలు ఇక కేవలం వ్యక్తిగత జీవనానికి పరిమితం కాకుండా, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతున్నాయి.

యువత నాటి నుంచి నేటి వరకు ప్రయాణాన్ని చూస్తే ఒక స్పష్టమైన సత్యం వెలుగులోకి వస్తుంది. కాలమాన మార్పులు, సామాజిక పరిణామాలు, సాంకేతిక ప్రభావాలు వారికి కొత్త బాటలు చూపించినప్పటికీ, ప్రతి తరం తన కాలానికి తగ్గట్టుగా దేశానికి అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించింది. యాభై ఏళ్ల క్రితం వారు ఇచ్చిన క్రమశిక్షణ, సహనం, బాధ్యత నేటి యువతకు పునాది కాగా, నేటి యువత అందిస్తున్న ఆవిష్కరణ, ధైర్యం, గ్లోబల్ ఆలోచన రేపటి సమాజానికి బలమైన పునాదిగా నిలుస్తాయి.

## ప్రపంచ యువ్వన దిశలు

విదేశాల్లో యువతలో చోటుచేసుకుంటున్న మార్పులు మన దేశ యువతలో కనబడే మార్పులకు భిన్నమైన కోణాలు కలిగివున్నాయి. అక్కడి సమాజాలు వేగంగా మారుతున్న జీవనశైలిని స్వీకరించాయి. సాంకేతిక పరిణామాలు, ఆర్థిక విధానాలు, వృత్తి అవకాశాలు అన్నీ కలిసి

యువతకు విస్తారమైన ఎంపికలను అందిస్తున్నాయి. అమెరికా, యూరప్ వంటి దేశాల్లో విద్య నుంచి ఉద్యోగం వరకు ప్రతి దశలో విపరీతమైన పోటీ ఉంటుంది. కానీ ఆ పోటీతో పాటు స్వతంత్ర ఆలోచనలకు, సృజనాత్మకతకు మరింత ప్రోత్సాహం కూడా ఇస్తారు. అందువల్ల అక్కడి యువత తమ ఆలోచనలను ప్రపంచ స్థాయి ఆవిష్కరణలుగా మలచగలుగుతున్నారు.

ఆసియా దేశాలలో మార్పులు వేరే విధంగా చోటుచేసుకుంటున్నాయి. జపాన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాల్లో క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం, సమూహ ప్రాధాన్యత ఇప్పటికీ ప్రధాన విలువలుగా నిలిచాయి.



కానీ అదే సమయంలో వారు ఆధునికతను, సాంకేతికతను పూర్తిగా ఆచరణలోకి తెచ్చారు. అక్కడి యువత శ్రమతో కూడిన పనితనాన్ని ఆధునిక పరిశోధనలతో మిళితం చేస్తూ తమ దేశాలను ప్రపంచంలో ముందంజలో నిలుపుతున్నారు.

ఆఫ్రికా దేశాలలో యువత మార్పులు ఆశాజనకమైన కొత్త దిశను చూపిస్తున్నాయి. వలస పాలన తరువాత కష్టాల మధ్య ప్రయాణించిన ఆ ప్రాంతం ఇప్పుడు విద్యా ప్రాధాన్యతను గ్రహించి, యువతను శక్తివంతం చేయడానికి ప్రయత్నిస్తోంది. అక్కడి యువత కళలు, క్రీడలు, సంగీతం, సాంకేతిక రంగాలలో కొత్త అవకాశాలను వెతుకుతూ ముందుకు సాగుతున్నారు. సహజ సంపదల వినియోగం, పర్యావరణ పరిరక్షణలో కూడా వారు చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

విదేశీ యువతలో గమనించదగ్గ ఒక ప్రధాన అంశం.. స్వతంత్ర జీవనశైలి. చాలా దేశాల్లో వారు చిన్న వయస్సులోనే కుటుంబం నుండి స్వతంత్రంగా బయటకు వచ్చి తమ భవిష్యత్తును స్వయంగా నిర్మించుకుంటారు. ఇది వారికి బాధ్యతాభారాన్ని పెంచుతుంది, నిర్ణయాలు తీసుకునే ధైర్యాన్ని కలిగిస్తుంది. అదే సమయంలో వారిలో ఒంటరితనం, మానసిక ఒత్తిడి కూడా ఎక్కువయ్యే అవకాశముంటుంది. ఈ విభిన్న అనుభవాలు వారికి కొత్త సవాళ్లను ఎదుర్కోవడంలో శక్తినిస్తాయి.

గ్లోబల్ స్థాయిలో మరో స్పష్టమైన మార్పు.. పర్యావరణ చైతన్యం. యూరప్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల యువత పచ్చని జీవన విధానాన్ని, పునరుత్పత్తి శక్తి వినియోగాన్ని, పర్యావరణ పరిరక్షణను తమ ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నారు. ఇది వారికి కొత్త విధమైన సామాజిక బాధ్యతను కలిగిస్తోంది.

ఇలా విదేశీ యువతలో చోటు చేసుకుంటున్న మార్పులు మన దేశ యువతపై కూడా పరోక్ష ప్రభావం చూపుతున్నాయి. వారు అనుసరించే సృజనాత్మక మార్గాలు, స్వేచ్ఛా భావన, పర్యావరణ చైతన్యం, ఆవిష్కరణాత్మక ఆలోచనలు మన యువతను కూడా ప్రేరేపిస్తున్నాయి. ప్రపంచం మొత్తంలో యువత ఒకే స్ఫూర్తితో ముందుకు సాగుతుందనే భావన ఇలాంటి మార్పుల ద్వారా బలపడుతోంది.

## నూతన యుగపు పిలుపు

ప్రపంచమంతా యువతలో చోటుచేసుకున్న ఈ మార్పులు మానవ సమాజాన్ని ఒక కొత్త దశలోకి నడిపిస్తున్నాయి. ప్రతి తరం తనకున్న కాలాన్ని అనుసరించి నూతన పంథాలను స్వీకరించింది. కానీ నేటి తరంలో కనిపిస్తున్న వైవిధ్యం, ఆవిష్కరణాత్మకత, వేగం పూర్వంలో ఎన్నడూ లేని స్థాయిలో ఉంది. సాంకేతికతను ఆధారంగా చేసుకుని, పర్యావరణాన్ని కాపాడుతూ, సమాజాన్ని కొత్త విలువల వైపు నడిపిస్తూ యువత నేటి ప్రపంచాన్ని మార్చుతున్నారు.

మన దేశ యువత కూడా ఈ ప్రపంచ ధోరణులను గమనించి, వాటిని తమ సంస్కృతితో మేళవించుకోవడం అవసరం. పాశ్చాత్య దేశాల స్వతంత్ర భావన, ఆసియా దేశాల క్రమశిక్షణ, ఆఫ్రికా దేశాల కొత్త ఆశయాలు.. ఇవన్నీ భారతీయ యువతకు పాఠాలుగా మారవచ్చు. అయితే ఈ మార్పుల మధ్యలో కూడా మన సంస్కృతికి ప్రాణమైన విలువలను కాపాడుకోవడం అత్యంత ప్రధానమైన కర్తవ్యంగా ఉంటుంది. ఎందుకంటే ఒక దేశాన్ని ముందుకు నడిపేది కేవలం సాంకేతికత కాదు, ఆ దేశపు ఆత్మస్వరూపాన్ని నిలబెట్టే సంస్కృతి కూడా.

ఈ సమగ్ర దిశలో యువత ఆలోచనలకూ, చర్యలకూ ఒకే తత్తం దృఢంగా కనిపిస్తోంది.. ప్రపంచాన్ని మార్చగలిగేది మనమే అన్న నమ్మకం. ఈ నమ్మకం ఉన్నంత కాలం యువత వ్యక్తిగత జీవితం నుంచి సామాజిక నిర్మాణం వరకు ప్రతిదానిలో కొత్త వెలుగును ప్రసరింపజేస్తారు. భవిష్యత్తు కాలం వారి చేతుల్లోనే ఉందని వారు తెలుసుకున్నారు. ఈ అవగాహన ఆధునిక యుగానికి నూతన పిలుపుగా మారింది.

– డా॥ చిటికెన కిరణ్‌కుమార్

వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458




# ప్రధాన ద్వారానికి ఎదురుగా గొయ్యి?

**ఎస్.ప్రభాకర్, నల్గొండ**

**ప్రశ్న: గొప్ప గొప్ప పాత భవనాల ముందు గోతులు(గొయ్యి) కనిపిస్తూ ఉంటాయి. వాస్తు యోగ్యం కానివైతే అలా కట్టేవారు కాదని నా అభిప్రాయం. ఇంటిముందు 'గొయ్యి' ఉండకూడదని కూడా అంటారు. ఇవి రెండూ పరస్పరం వాస్తు విరుద్ధమైనవి కాదా! వీటిని ఎలా అర్థం చేసుకోవాలి?**

**జవాబు:** విషయాన్ని కాస్త లోతుగా తరచి చూస్తే అదే అర్థమవుతుంది. ఒక చిన్న ఇంటికైనా సరే, ఒక గొప్ప భవనానికైనా సరే, వాస్తు నియమాల్లో ఉండదు. ఇంటి(ద్వారానికి) ముందు గొయ్యి ఉండకూడదు. అది ఎటువంటి ఇల్లయినా సరే. ఇదీ వాస్తు నియమం.

గొయ్యిపై నుండి నడుచుకుంటూ సరాసరి ఇంట్లోకి రాకూడదు. ఆ ప్రభావం లేకుండా జలస్తంభాలు నిర్మించుకునేందుకు వాస్తు శాస్త్రంలో 'వసతి' ఉన్నది. మీరు పేర్కొన్న గొప్ప గొప్ప పాత భవనాలను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. అవన్నీ చాలా విశాలమైన స్థలాలలో నిర్మించారు. ఎన్నో మెట్లెక్కిగానీ వాటి ప్రధాన ద్వారానికి చేరలేం.

## వాస్తు శాస్త్రంలో వీటి నిర్మాణ నియమాలు

జలస్తంభాలు గృహానికి తూర్పు భాగంలో ఉత్తర భాగంలోనే ఉండాలి. పశ్చిమ, దక్షిణ దిక్కుల్లో నిర్మించటం వాస్తు నియమాలకు విరుద్ధం. గృహం తూర్పు లేదా ఉతనతర ద్వారం ఎంత ఎత్తున ఉన్నదో అంతకు మూడు రెట్లు ఖాళీ స్థలం వదిలిపెట్టిన తరువాతనే జలస్తంభాలను నిర్మించాలి.



జలస్తంభాల నిర్మాణం తరువాత కూడా (తూర్పు, ఉత్తర దిక్కుల్లో ఇంకా ఎక్కువ ఖాళీస్థలం ఉండాలి. అంటే అంత ఎక్కువ విశాలమైన స్థలాలు ఉన్నప్పుడే జలస్తంభాలు నిర్మించుకోవాలి, లేదా నిర్మించకూడదు. వాటిపై నుండి నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్లే విధంగా ఉండకూడదు. ప్రస్తుతం అతి పరిమితంగా ఉండే గృహ నిర్మాణ స్థలాల్లో ఇవి వీలుపడవు. 'మోజు' కొద్ది కట్టుకుంటే దోషాలు ఏర్పడి ఫలితాలలో తేడాలు రావచ్చు. పరస్పర విరుద్ధాలు అయ్యే విషయాలు అన్ని శాస్త్రాల్లో ఉంటాయి. విషం ప్రాణాంతకమైనది. కానీ వైదనయంలో అదే ప్రాణదాత, ఔషధంగా కూడా పని చేస్తుంది. అలాగే తూర్పు ముఖద్వారం మంచిది. తూర్పున బావి మంచిదే. కానీ ఈ రెండూ ఎదురెదురుగా ఉండే 'కాంబినేషన్' మంచిది కాదు.

'దక్షిణ వీధిపోటు' మంచిది కాదు. కానీ అదే వీధిపోటు 'దక్షిణ ఆగ్నేయం' భాగంలో తగిలితే కళ్యాణప్రదమవుతుంది. ఎన్నో సందర్భాలలో దేనికి దానిని విడిగా అర్థం చేసుకోవడం కంటే వాటి వాటి సంకలనాలను(కాంబినేషన్స్) బట్టి అర్థం చేసుకోవడం సరైన పద్ధతి. ■

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:

**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................

పుట్టిన తేది : ..............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................

చిరునామా:..............................................

– నూతన మిత్రుణ్ణి, పాత శత్రువును నమ్మవద్దు. – కెల్లి

– దూరదృష్టి ఉన్నవాడే తన దారిని సరిగా గుర్తుపడతాడు. – హోమర్ జోల్ట్

– ప్రమాదాన్ని ముందుగా ఊహిస్తే, దానిని సగం అధిగమించినట్లే. – థామస్ ఫుల్లర్

ఈ వారం కవిత్వం


## నా జీవన సంధ్యా సమయంలో..



కాస్మిక్ కిరణాలు మనస్సును
శరీరాన్ని
చురుక్కుమనిపిస్తుంటయ్!
జీవితపు పందేరాలలో
లైఫ్‌స్టయిల్
ఎన్ని సార్లు యూ టర్న్
తీసుకోవాలో తెలవదు
కానీ.. మైకం కమ్మిన కంట్రోల్
లేని స్టీరింగ్
ఎటు తిరుగుతుందో ఎవరికి
యెరుక!
అంబరాన అందమైన రంగుల హరివిల్లును చూచి
రంగులు మార్చే గోడ మీద వూసరవెల్లికి
పోలికలెందుకు?
ఇప్పుడు.. పాలపుంత పండువెన్నెలలో
రాట్నం వడుకుతూ పిల్లలకు అద్భుత
తాతల నాటి కథలు చెప్పే పేదరాసి పెద్దమ్మ
చంద్రునిలో ఏనాడో మాయమైంది.
అయినా.. స్వచ్ఛత లేని
వాతావరణంలో
బేల చూపుల లేడివలె ప్రకృతికాంత
ఓ అనాథలా దర్శనమిస్తుంటే
వింత యేముంది?
నోటికి ఇంకా ఐదు వేళ్లు అందని
అనాథలు
అభాగ్యులు ఒక వైపు దీన స్థితినుంటే,
వాతావరణ సమతుల్యత లేక
అతివృష్టి అనావృష్టులతో ధరిత్రి
మరోవైపు కానవస్తున్నది.
అయినా ఎంతకూ విజయం వరించని
జీవన సమరం వంటిది సగటు మనిషి జీవనం!

**– ఏవివి ప్రసాద్ శర్మ**

## పెరటి వసంతం–అడవి మంటలు



ఇష్ట సఖీ! నీ పైన
మోహం రోజు రోజుకి
పెరుగుతుంది
కాలం ఇప్పుడు దానికి
ఆజ్యం పోస్తున్న తైలం
మోహం ఇంతగా నన్ను
దహిస్తున్నపుడు
కాలుతున్న మోహపు నా
దేహాన్ని చల్లార్చగలిగె
ఏకైక ప్రేమ సంద్రం నీవు
నీ చెంతకు చేరి
చల్లబడుదామనుకుంటే
నీవు నేను వేరు వేరు
అంచులలో నిలబడ్డవాళ్ళం

ఐతే సఖీ!
నాకిప్పుడు నీ చెంతకు చేరాలని లేదు
ప్రపంచం ఇంతగా దుఃఖిస్తున్నపుడు
నేనొక్కడిని ఎట్లా సుఖపడగలను
చెప్పు!
అడవి మంటల్లో కాలుతున్నపుడు
నా ఇంటి పెరటి వసంతాన్ని చూస్తూ
మురిసిపోయేటంతటి అల్పానంద
మూర్ఖున్ని కాదు నేను.

**– దిలీప్.వి**

## జారుడు బండ

నెత్తి మీద సల్లకుండ
సిగ నిండా పూల దండ
ఎండ పూటా చల్లగుండ
చింతల్ల నడుచుచుండ !

కొండ మీద కొండ
నీడలు అటుఇటు జారుచుండ
పొద్దు మాపు లెరుగకుండ
కొండంత ఆశయం అండ !

కూర్చున్న పరుపుబండ
ఊహల ఊయలై ఊగుచుండ
ఆలోచనల జారుడుబండ
పూల తేరు లో తిరుగుచుండ !

మనసున మనసై వుండ
చింతలన్నీ తీరుచుండ
గుండె గుసగుసలాడుచుండ
మమతల తలపులే మది నిండా!

**– పట్లోళ్ళ బక్కారెడ్డి**

## బతుకు వేడుక

అప్పుడప్పుడు
మనసు
చనిపోవాలి.
మసికాబడ్డ
ఆలోచనలో
మళ్ళీ విలువ
పుట్టాలి.

కొన్ని రోజులపాటు కాలం
తెగి
సమయం తెలియకుండా
పోయి
చీకటికి చిక్కుపడి
జీవితం అడుక్కుపోయినా
నిటారైన ఒక్క మాట ఒడ్డుకు
మనిషిని మనిషే ఈదుకుంటూ
మనసు జీవాన్ని ధరించి
బతుకు వేడుక కావాలి.

**– చందలూరి నారాయణరావు**

తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారి జిల్లాలో నెలకొని ఉన్న పన్నెండు శివాలయాలను మహాశివరాత్రి పర్వదినాన కాలినడకన సందర్శించడానికి చేసే యాత్రను 'శివాలయ ఒట్టం' అని పిలుస్తారు.

కన్యాకుమారి జిల్లాలో వంద కిలోమీటర్ల పరిధిలో నెలకొని ఉన్న పన్నెండు శివాలయాలను మహాశివరాత్రి రోజు దర్శించుకోవడం పరమ పుణ్యప్రదం విశ్వాసంతో భక్తులు కాలినడకన ఈ యాత్ర

స్థానిక గాథల ఆధారంగా ఈ ఆలయం కృత యుగం నుండి ఉన్నట్లుగా తెలుస్తోంది. రామాయణ మహాభారతాలలో కూడా ఈ ఆలయ ప్రస్థాపన ఉన్నది అని చెబుతారు.

కృత యుగంలో 'శ్రీశైలం, త్రేతాయుగంలో "స్వామి శైలం', ద్వాపరంలో 'భవ్య శైలం' గా పిలువబడి కలియుగంలో "శివ శైలం'గా పిలవబడుతున్నది.

చిన్న పర్వతం మీద నిర్మించబడిన ఆలయం ఏనాటిది? అన్న

రాజుల తరువాత మధురైని పాలించిన నాయక రాజులు విశేషంగా ఆలయ పురోగతికి పాటుపడ్డారు.. అని శాసనాలు తెలియ చేస్తున్నాయి. కారణం నాయక రాజులలో ప్రసిద్ధుడైన 'తిరుమలై నాయకర్' స్వామివారి అనుగ్రహంతో జన్మించడమే అని అంటారు.

## తిరుమలై నాయకర్

శ్రీకృష్ణదేవరాయల సామంతులుగా మధురైని పాలించిన తెలుగు నాయక

# శివాలయ ఒట్టంలోని 'తిరుమలై ముంచిరై'

చేస్తారు. భక్తులు అమితోత్సాహం, భక్తిప్రపత్తులతో చేసే శివాలయ ఒట్టం ఆలయాలలో మొదటిది శ్రీ మహేశ్వరుడు మహాదేవర్‌గా కొలువైన 'తిరుమలై ముంచిరై' అని కూడా పిలుస్తారు.

తమిళనాడులో కావేరి తరువాత ప్రముఖమైన నది తమిరపారాణి లేక తామ్రపర్ణి. ఈ నది కేరళ రాష్ట్ర సరిహద్దులలోని అగస్త్యమలైలో ఉద్భవిస్తుంది. అనేకానేక ఉపనదులు మార్గంలో తామ్రపర్ణితో కలుస్తాయి. వాటిలో ముఖ్యమైనది 'కడయార్ నది'. తామ్రపర్ణి మరో ఉపనది అయిన చిత్రానది సోయగాలను జలపాతాల రూపంలో కుర్తాళంలో వీక్షి ంచవచ్చు. ముంచిరై కడయార్ నదీ తీరంలో నెలకొని ఉన్నది. శివాలయ ఒట్టం యాత్ర చేసే ప్రతి ఒక్కరూ ఈ నదిలో స్నానమాచరిస్తారు. అనంతరం శ్రీ తిరుమలై మహాదేవర్ దర్శనానికి వెళతారు.

## క్షేత్ర గాథ

మూల గాథ ద్వాపర యుగం నాటిది అని చెప్పడం జరిగింది. కానీ విషయంలో పూర్తి స్పష్టత లేదు. కానీ ప్రస్తుత నిర్మాణం పదకొండవ శతాబ్దంలో ఒకటవ రాజేంద్ర చోళుని కాలంలో జరిగినట్లు తెలిపే శాసనాలు ఆలయంలో కనపడతాయి.

కాలగమనంలో ఎందరో రాజవంశాల వారు ఈ ప్రాంతాన్ని పాలించారు. వారు చేపట్టిన ఆలయాభివృద్ధి క్రమంలో ఎన్నో మార్పులు చేర్పులకు లోనైనది. అందువలన ఒక క్రమ పద్ధతి లేకపోయినా ఆలయంలో ద్రావిడ, కేరళ శైలి నిర్మాణాలు కనిపిస్తాయి. ప్రధాన గర్భాలయం పైన ఉన్న విమాన గోపురం, మండప స్తంభాలు చోళ కాలపు నిర్మాణ శైలిని ప్రస్ఫుటంగా ప్రదర్శిస్తాయి. చోళ

వంశంవారు. విశ్వనాథ నాయకుడు వీరి వంశానికి ప్రథమ పాలకుడు. ఈ వంశానికి చెందిన 'ముత్తు కృష్ణప్ప నాయకర్'కి సంతానం లేదట. ఆయన భార్య 'ఉతాచి' ఈ క్షేత్రానికి వచ్చి ఇక్కడ ఉన్న కోటలో ఉంటూ నియమంగా స్వామివారిని సేవించేదట.

తిరుమలై మహాదేవర్ అనుగ్రహంతో ఆమెకు పుత్ర సంతానం కలిగిందట. ఈ ఆలయానికి సమీపంలోని కోటను 'ఉతాచి కోట' అని పిలుస్తారు. ఆ పుత్రుడే 'తిరుమలై నాయకర్' మధురై పట్టణంలో నేటికీ కనిపించే అనేక ఆలయాలు ఈయన కాలంలోనే పునః నిర్మించబడినాయి.



పట్టణంలోని తిరుమలై నాయకర్ రాజ భవనం ఎంతో మంది సందర్శకులను ఆకర్షిస్తుంది. తన రాజ్యంలో అనేక ఆలయాలను కూడా నిర్మించారు. రాజ్యాధికారం పొందిన తరువాత తిరుమలై నాయకర్ మహాదేవర్‌కు బంగారంతో నేసిన వస్త్రాలు, బంగారు కిరీటాన్ని సమర్పించుకున్నారు.. అని ఆలయంలోని శాసనంలో పేర్కొన్నారు.

### ఆలయ విశేషాలు

ముంచిరై మహాదేవర్, శూల పాణిగా పిలవబడే కైలాసనాథుడు కొలువైన శివాలయం ఒట్టంలోని తొలి ఆలయం కొద్దిగా ఎత్తైన గుట్ట మీద నిర్మించారు. పైకి వెళ్లడానికి సోపాన మార్గం నిర్మించారు. కేరళ, ద్రావిడ శైలిలో నిర్మించబడిన రెండు ప్రధాన ఆలయాలు/శ్రీకోవెలలు కనిపిస్తాయి. ఒకదానిలో శ్రీ ముంచిరై మహాదేవర్, రెండవ దానిలో శ్రీకృష్ణుడు కొలువై దర్శనమిస్తారు. ఎత్తైన ధ్వజస్థంభం, సుందరమైన రిషభ(నంది) మండపం, చక్కని శిల్పాలతో అలంకరించబడిన విమాన గోపురం అదనపు శోభను అందిస్తాయి. ప్రాంగణంలో అనేక కాలాలలో నిర్మించిన ఎన్నో ఉపాలయాలలో శ్రీ గణపతి, శ్రీ సుబ్రహ్మణ్య, శ్రీ పార్వతీ సన్నిధులతో పాటు మండపాలు కూడా కనిపిస్తాయి. చక్కని రాతిస్తంభాలు, రాతి మండపాలు చోళ, నాయక శైలిని ప్రదర్శిస్తాయి.

దేవతా వృక్షాలతో పచ్చదనం సంతరించుకున్న ఆలయ ప్రాంగణం ప్రశాంత, పరిశుభ్ర, ఆధ్యాత్మిక వాతావరణానికి చిరునామా అని చెప్పవచ్చు. శివాలయ ఒట్టం యాత్ర చేసే భక్తులు ముందు రోజు సాయంత్రం ఇక్కడికి చేరుకుంటారు. అలా అయితేనే ఒక్క రోజులో యాత్ర పూర్తి చేయవచ్చు.



భక్తిప్రపత్తులతో నదిలో స్నానం చేస్తారు. కాషాయ వస్త్రాలు లేదా నుదిటిన కాషాయ పట్టి ధరించి చేతిలో లేత తాటి ఆకును పట్టుకొని "గోపాల.. గోవిందా" అంటూ ఆలయంలోకి ప్రవేశిస్తారు. ముందుగా ప్రాంగణంలో కొలువైన దేవీదేవతలను దర్శించుకొంటారు. చివరగా విభూతిని తీసుకొని తరువాతి ఆలయానికి "గోపాల.. గోవిందా" అంటూ పరుగులు పెడతారు. మహాశివరాత్రి రోజున శివాలయ ఒట్టం సందర్భంగా ఇరవై నాలుగు గంటలు తెరిచి ఉంటుంది. విడి రోజులలో ఉదయం అయిదు గంటల నుండి పదకొండు గంటల వరకు మాత్రమే తెరిచి ఉంటుంది.

నిర్ణయించిన పూజలు నిత్యం నాలుగు వేళలలో జరుపుతారు. పర్వదినాలలో, స్థానిక ప్రత్యేక రోజులలో విశేష పూజలు, అభిషేకాలు, ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దిన, పక్ష, మాస పూజలు ఎప్పుడో పూర్వ కాలంలో నిర్ణయించిన విధానంలో జరపడం ఇక్కడ చెప్పుకోవలసిన అంశం. మహాశివరాత్రినాడు రాలేనివారు విడి రోజులలో వాహనాలలో శివాలయ ఒట్టం యాత్ర చేస్తుంటారు. ముందు రోజు సాయంత్రం ఇక్కడి నుండి ప్రారంభించిన యాత్ర శివరాత్రి లోపల పూర్తి చేస్తారు.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు

---

(18వ పేజీ తరువాయి...)

## ఫలించిన స్వప్నం

ఫిబ్రవరి 24, 1988న ముంబైలోని ఆజాద్ మైదాన్‌లోని ససానియన్ గ్రౌండ్‌లో శారదాశ్రమ్ విద్యా మందిర్, సెయింట్ జేవియర్స్ మధ్య జరిగిన హారిస్ షీల్డ్ ట్రోఫీ మ్యాచ్ సందర్భంగా సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లి మధ్య 664 పరుగుల భాగస్వామ్యం ఏర్పడడంతో తదుపరి బ్యాటర్‌గా ప్యాడ్స్ కట్టుకుని ఎంతో ఉత్సాహంగా సిద్ధంగా ఉన్నప్పటికీ అతనికి తన ఆటను ప్రదర్శించే అవకాశమే దక్కలేదు.

తన తొలి రంజీ ట్రోఫీ మ్యాచ్‌లోనే 260 పరుగులు చేసిన ముజుందార్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఒక సంచలన ఆటగాడిగా ఒక్క ఉదుటున వెలుగులోకి వచ్చాడు. ఆ సమయంలో, అరంగేట్రంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ఇదే ప్రపంచ రికార్డు కావడం విశేషం. రెండు దశాబ్దాలకు పైగా ఉన్న తన అద్భుతమైన కెరీర్‌లో, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 11,000 పరుగులు, 30 సెంచరీలు సాధించడం రంజీ ట్రోఫీలోనే రికార్డు. 1996 ఒకసారి వినోద్ కాంబ్లీ పేలవమైన ఆటతీరు కారణంగా దాదాపు అవకాశం వచ్చినప్పటికీ రాహుల్ ద్రావిడ్ రాక ఆ తరువాత మిడిల్ ఆర్డర్‌లో తన స్థిరమైన ఆటతీరుతో 'ది వాల్' అనే పేరుతో జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవడంతో తరచుగా 'తదుపరి టెండూల్కర్' అని ముద్రపడ్డ అమోల్ ముజుందార్ అంతర్జాతీయంగా భారతదేశానికి ప్రాతినిథ్యం వహించని గొప్ప దేశీయ దిగ్గజంగానే మిగిలిపోయాడు.

**కొసమెరుపు:** భారత మహిళా క్రికెట్ జట్టు ఐసిసి 2025 వరల్డ్ కప్ చేజిక్కించుకోవడంతో జట్టు ప్రధాన శిక్షకుడు అమోల్ ముజుందార్ పేరు ఒక్కసారి తారాజువ్వలా పైకి ఎగిసి దేశమంతా మార్మోగిపోతోంది. అయితే భారత మహిళా జట్టు ఈ అపూర్వ విజయాన్ని సాధించి ఉండకపోతే ఇంత ప్రతిభావంతుడైన అమోల్ ముజుందార్ పేరు చరిత్ర పుటల్లో ఎటువంటి గుర్తింపు లేకుండా శిథిలమైపోయేది!

– యేచన్ చంద్రశేఖర్

# 16 నవంబరు, 2025 నుండి 22 నవంబరు, 2025 వరకు

## వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం కొంతమంది వల్ల నిరాశ ఎదురవుతుంది ఆశించిన స్థాయిలో వారి అండదండలు లభించకపోవచ్చు. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి.

### వృషభం

ఈ వారం చేదోడు వాదోడుగా మీకు అండగా ఉంటారని కొంతమంది వ్యక్తులను చేరదీస్తారు. వాళ్ళకి కావలసినటువంటి సదుపాయాన్ని ఏర్పాటు చేస్తారు. మంచితనంతో మీరు చేసిన ఈ పనికి వక్ర భాష్యాలు అంటగట్టే వారు తారసపడతారు. మరీ ముఖ్యంగా కుటుంబంలో వారి ఈ రకమైనటువంటి విమర్శలు చేయటం మీకు ఏమాత్రం నచ్చదు. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి.

### మిథునం

ఈ వారం స్వల్పమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. కళా సాహిత్యకారులకు మీ ప్రతిభా పాటవాళ్లకు మంచి పేరు అవకాశాలు, సన్మాన యోగాలు సన్మానము కలుగుతుంది. కార్యాలయంలో కొత్త వాతావరణం ఏర్పడుతుంది.కొంతమంది వ్యక్తుల ప్రవర్తన బాధకి భాగోద్వేగాలకి కారణమవుతుంది. పూజల్లో నాగ సింధూరం కుంకుమను ఉపయోగించండి. నూతన వ్యాపార ఒప్పందాలు బాగుంటాయి.

### కర్కాటకం

ఈ వారం కిందిస్థాయి ఉద్యోగస్తులు పరిచారకులతో తరచుగా ఇబ్బందులు పడటం వాళ్ళ ద్వారా వ్యాపార ప్రదేశాలలో సమస్యలు ఎదుర్కొనే విధంగా గోచరిస్తున్నది. తల్లి తరపు బంధువులతో ఆ కారణమైన భేదాభిప్రాయాలు గొడవలు చోటు చేసుకోవచ్చు. కొంతమంది చేసే పనులు ప్రయత్నాలు మిమ్మల్ని ఎంతగానో ఆకర్షిస్తుంది. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి.

### సింహం

: ఈ వారం వ్యాపార విస్తరణ కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. కొత్త పెట్టుబడులు తీసుకురాగలుగుతారు. మీ పేరు మీద నడిచే సంస్థలకు మంచి గుర్తింపు కలుగుతుంది. అనుకున్న విధంగా బ్రాంచ్‌ని ఓపెన్ చేయగలుగుతారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. విద్యాపరమైనటువంటి విషయాలలో ఎదురుదెబ్బలు తగులుతుంది.

### కన్య

ఈ వారం నూతన వస్తువులు వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. కొన్ని పదవుల కోసం ప్రయత్నం చేయాలని భావిస్తారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులకు ఇట్టి విషయాలను తెలియనివ్వవద్దు.

### తుల

ఈ వారం కొన్ని ముఖ్యమైన పనులు జరిపించుకొవటానికి ఎంతగానో శ్రమిస్తారు. తేలికగా పూర్తయ్యే పనులు కూడా ఎంతో బలవంతంగా పూర్తి చేయడం శారీరిక మానసిక అలసట శ్రమకి కారణం అవుతుంది. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. చిన్న చిన్న ప్రయాణాలు తరచుగా చేస్తారు. లిఖిత పూర్వకమైన పత్రాల పట్ల ఖచ్చితమైన శ్రద్ధ చూపించండి. కీళ్ల నొప్పులు నేత్రవ్యాధులుతో అవస్థ పడే అవకాశం ఉంది.

### వృశ్చికం

ఈ వారం కాలక్రమంలో కొన్ని విషయాలు, కొంతమంది వ్యక్తుల ప్రవర్తన మీరు సర్దుకుపోతారు. చర్మ సంబంధమైన అనారోగ్యాలు వాటిల్లే అవకాశముంది. జాగ్రత్త వహించండి. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు వినగలుగుతాయి. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. చిన్న వ్యాపారస్తులకు అనుకూలమైన మార్పులు ఏర్పడతాయి.

### ధనస్సు

ఈ వారం మీ తెలివితేటలు నైపుణ్యం ప్రదర్శించటానికి ఒక చక్కని అవకాశము మీ ముందుకు వస్తుంది. నేర్పుగా ఉపయోగించుకోండి. కొనుగోలు అమ్మకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. ప్రశాంతంగా ఆలోచించి కొన్ని నిర్ణయాలు తీసుకోవడం వలన ఆర్థికంగా లాభపడతారు. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి. రహస్య శత్రువులు వెలుగులోనికి వస్తారు. నరఘోష అధికంగా ఉంటుంది. శుభవార్తా శ్రవణం చేస్తారు.

### మకరం

ఈ వారం రహస్య మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలకు పెట్టుబడులను అందిస్తారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. రహస్య సమాచారము కీలకమైన వ్యక్తుల గురించి అసలు విషయాలను తెలుసు కోగలుగుతారు.బ్యాంకు రుణాల గురించి అధికంగా ఆలోచిస్తారు.


### కుంభం

ఈ వారం ప్రతినిత్యం హనుమాన్ చాలీసా పఠించడం వలన మంచి ఫలితాలు ఉంటాయి. వ్యాపారస్థులకు మధ్యస్త ఫలితాలు గోచరిస్తున్నాయి. నూతన అవకాశాలు లభిస్తాయి. కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిష్ణాతుల సలహాలను పరిగణలోనికి తీసుకొనండి. ఐశ్వర్యనాగినిని ఉపయోగించడం వలన లక్ష్మీదేవి అనుగ్రహం, లక్ష్మీ కటాక్షం కలుగుతుంది. అగ్రిమెంట్లు ముఖ్యమైన సంతకాలు చేసేటప్పుడు సాంకేతిక లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడండి.


### మీనం

ఈ వారం వ్యాపార కేంద్రాలలో వస్తున్న మార్పులను గమనిస్తారు. కొంతమంది చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తారు. కీళ్ల నొప్పులు, నేత్రవ్యాధులతో అవస్థ పడే అవకాశం ఉంది. నవగ్రహాల దగ్గర నవగ్రహ వత్తులతో అష్టమూలిక తైలంతో దీపారాధన చేయండి. కొన్ని కార్యక్రమాల నిమిత్తం మీ పలుకుబడిని పరపతిని ఎంతగానో ఉపయోగిస్తారు. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాన్ని మొదలుపెడతారు.


# ఈ వారం కార్టూన్స్




అన్న ఒకేసారి ట్రై చేసావా?!

బావా.. నీవు తోపువి.. బస్సులో వెళ్లి బస్సులో వచ్చావు!!
BUS STAND

ఎవరితో వచ్చినా అయ్యగారు పల్లీలు కొంటారు..
ఈరోజు కొనడం లేదు.. నీకు పల్లీలు పడవా యల్లే?!
PARK









ఫోటో ఫీచర్

కుండలే కదా.. ఇందులో చూడ్డానికి పెద్ద వింత ఏముంది? అనుకోకండి.. జార్జియాలోని షాలోరీ గ్రామంలో ఉన్న హోటల్‌కు సంబంధించిన చిత్రాలివి. నిర్వాహకులు కాస్త విభిన్నంగా ఆలోచించి నిర్మించిన ఈ హోటల్‌లో విలాసవంతమైన సకల సౌకర్యాలు ఉన్నాయి.



